విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :139 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 6 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడింది

- భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు
- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య
- ఈయూ ఒప్పందాన్ని విజయవంతమైన ఉదాహరణగా చూపిన ఆర్థిక మంత్రి



## చట్టం ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలి

- న్యాయంలో మానవీయ కోణం కీలకం
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు
- న్యాయవ్యవస్థ పనితీరుపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు
- చట్టం అందరికీ అర్థమయ్యేలా ఉండాలని, న్యాయంలో కరుణ కీలకం అని స్పష్టం
- ముగ్గురు హైకోర్టు చీఫ్ జస్టిస్‌లను సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా నియమించిన కేంద్రం

# గ్రామీణ తాగునీటి కష్టాలకు చెక్

- వివేకా హత్య, లిక్కర్ స్కామ్‌పై సమాధానం చెప్పే ధైర్యం ఉందా?: చంద్రబాబు
- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో 'అమరజీవి జలధార' పథకం
- ప్రారంభించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- 90 లక్షల కుటుంబాలకు కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం
- రాయలసీమను హార్టికల్చర్, ఏరోస్పేస్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తామని హామీ



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రొద్దుటూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి ఇక్కడి నుంచే పొద్దుపొడుపు అవుతుందని అన్నారు. ఈ సభ వేదికగా రూ.30,156 కోట్ల భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మక 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్ 2.0) పథకానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 90 లక్షల కుటుంబాలకు ఇంటింటికీ కుళాయి వివరాలు 2లో..



## వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే

- కడప టికెట్ కోసం రూ.40 కోట్ల సుపారీ ఇచ్చారని జగన్‌పై తీవ్ర ఆరోపణలు
- రాయలసీమ, ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు
- పల్లె పండుగ 3.0, జలజీవన్ మిషన్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ

**అమరావతి**

సొంత బాబాయ్ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థలన్నీ ఆధారాలతో తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి జగన్ మౌనం వహించడం ఆయన నేరాన్ని అంగీకరించడమేనని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కడప ఎంపీ టికెట్ కోసం ఏకంగా రూ.40 కోట్ల వివరాలు 2లో..

## ప్రాజెక్టుల గ్రౌండింగ్‌పై ప్రత్యేక దృష్టి

- ఎస్ఐపీబీ ద్వారా 388 ప్రాజెక్టులకు ఆమోదం
- భారీ పెట్టుబడులను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంపై ప్రభుత్వం దృష్టి సారించింది
- ఎస్ఐపీబీ ద్వారా 388 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది
- సుమారు రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులు 10.79 లక్షల మందికి ఉపాధి అవకాశాలు



## నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట

- 2029 నాటికి 4-స్టార్.. ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు!
- ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం
- 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం
- ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం
- ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ వివరాలు 2లో..



## ఇది అస్థిరత యుగం

- కానీ సవాళ్లను అధిగమిస్తామనే నమ్మకం ఉంది'
- కేంద్రమంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు
- ప్రపంచం ఘర్షణలు, టారిఫ్స్ అస్థిరతతో ఫ్లక్స్ యుగంలోకి వెళ్తోందన్న జైశంకర్
- భారత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటుందని ఆశాభావం
- రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు చర్చలు, దౌత్యమే మార్గమని చెప్పిన విదేశాంగ మంత్రి

## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ
- పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడి
- ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు, ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ



**అమరావతి**

"యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర వివరాలు 2లో..



## భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది

- ఏఐ, వాణిజ్యంలో కలిసి పనిచేస్తాం
- స్విస్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్
- గ్లోబల్ గవర్నెన్స్, డిప్లొమాసీలో భారత్ కీలక శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ అధ్యక్షుడి ప్రశంసలు
- 2027 లో జెనీవాలో నిర్వహించే గ్లోబల్ ఏఐ సమిట్‌కు భారత్ భాగస్వామ్యాన్ని కోరిన గై పార్మెలిన్

# గ్రామీణ తాగునీటి కష్టాలకు చెక్

-మొదటిపేజీ తరువాయి

ద్వారా సురక్షితమైన తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూ, పలు కీలక అంశాలపై ప్రతిపక్ష నేతకు సవాల్ విసిరారు. సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ రోజు ప్రొద్దుటూరులో ఈ బృహత్కార్యక్రమాన్ని ప్రారంభించాం. తెలుగు జాతి కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి స్ఫూర్తితో ఈ పథకానికి 'అమరజీవి జలధార' అని పేరు పెట్టాం. నీళ్లు తాగిన ప్రతిసారీ ఆయన త్యాగం గుర్తుకురావాలి. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 3 కోట్ల 30 లక్షల మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. మహిళల నీటి కష్టాలు తీరడంతో పాటు వారి శ్రమ, సమయం, ఖర్చు ఆదా అవుతాయి" అని వివరించారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులను సద్వినియోగం చేసుకోలేకపోయిందని, ఇతర రాష్ట్రాలు వేల కోట్లు వినియోగించుకుంటే, గొడ్డలి పార్టీ కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే ఖర్చు చేసి రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు.



### రాయలసీమ దశ మార్చేస్తాం.. రత్నాల సీమగా తీర్చిదిద్దుతాం

రాయలసీమ అభివృద్ధిపై తనకున్న దార్శనికతను వివరిస్తూ, "ఒకప్పుడు కరువు సీమ, రాళ్ల సీమగా పిలిచిన ఈ ప్రాంతాన్ని రత్నాల సీమగా, దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. మదనపల్లెలో లక్ష కోట్ల రూపాయలతో ప్రపంచానికి ఒక హార్టికల్చర్ హబ్‌గా తయారు చేసే కార్యక్రమానికి ఇప్పటికే శ్రీకారం చుట్టాం. రెండేళ్లలో రూ.24,000 కోట్లు ఖర్చు చేశాం. గొడ్డలి పార్టీ ఐదేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే. తేడా మీరే గమనించండి" అని అన్నారు. "రాయలసీమలో కేవలం హార్టికల్చర్ మాత్రమే కాదు, రాబోయే రెండేళ్లలో నెలకు రెండు శాటిలైట్లను ఇక్కడి నుంచే ప్రయోగించేలా స్పేస్ టెక్నాలజీ, పుట్టపర్తి నుంచి శత్రుదేశాల గుండెల్లో వణుకు పుట్టించే ఐదో తరం ఫైటర్ జెట్‌లను తయారు చేసే ఏరోస్పేస్, డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్, సిమెంట్, గ్రీన్ ఎనర్జీ వంటి ఎన్నో పరిశ్రమలు రానున్నాయి. ఒకప్పుడు స్వర్ణగిరిగా పిలిపించుకున్న జొన్నగిరిలో మళ్లీ బంగారు గనులు వచ్చాయి. రాయలసీమ సత్తా ఇది. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతాయి. బుల్లెట్ రైళ్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ తయారీ పరిశ్రమ కూడా ఇక్కడికే వస్తుంది. ఈ ప్రాంత యువత బుల్లెట్‌లా దూసుకుపోవాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

### పవన్ కల్యాణ్ నాయకత్వంలో పల్లెల ప్రగతి

కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనితీరును చంద్రబాబు ప్రశంసించారు. "నా మిత్రుడు పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధికి కొత్త రూటు వేశారు. మరెక్కడా లేని విధంగా పవన్ కల్యాణ్ రికార్డు స్థాయిలో ఒకేరోజు 13,326 గ్రామాల్లో గ్రామసభలు పెట్టించారు. ఆయన నాయకత్వంలో రెండున్నర దశాబ్దాల తర్వాత 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. పంచాయతీలకు రూ.4,136 కోట్ల నిధులు విడుదల చేయించాం. లక్షకు పైగా పంట కుంటలు, గోకులాలు ఏర్పాటు చేశారు. ఆయన నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కోసం ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నాం" అని ప్రకటించారు.

### గొడ్డలి పార్టీకి సూటి ప్రశ్నలు.. ధైర్యం ఉంటే సమాధానం చెప్పాలి

ఈ క్రమంలో గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. "ఈ కడప గడ్డ, ప్రొద్దుటూరు నుంచే సవాల్ విసురుతున్నా. వివేకానంద రెడ్డి హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిపోయింది. రూ.40 కోట్ల సుపారీ గుట్టు విప్పింది. దీనిపై సమాధానం చెప్పే ధైర్యం ఉందా? లిక్కర్ స్కామ్‌లో వేల కోట్లు దోచిన అంతిమ లబ్ధిదారు కూడా నువ్వేనని అన్ని వేళ్లూ నీ వైపే చూపిస్తున్నాయి. సమాధానం చెప్పగలవా?" అని నిలదీశారు. "ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు చేసి యువత జీవితాలతో ఆడుకున్నారు. ఇసుకను దోచుకున్నారు. మేము అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానం తెచ్చాం. మద్యం ధరల విషయంలోనూ పారదర్శకంగా ఉన్నాం. కానీ, వాళ్లు నేరాలు చేసి, ఆ నెపాన్ని ఎదుటివారిపై రుద్దడమే పనిగా పెట్టుకున్నారు. అదే వారి డీఎన్ఏ. వారికి అభివృద్ధి సిద్ధాంతం కాదు, కుట్రలు, హింసా రాజకీయాలే వారి సిద్ధాంతం" అని దుయ్యబట్టారు.

### ప్రొద్దుటూరుకు వరాలు.. స్థానిక సమస్యలకు పరిష్కారం

స్థానిక ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి కోరిక మేరకు ప్రొద్దుటూరు అభివృద్ధికి పలు వరాలు ప్రకటించారు. డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.35 కోట్లు, కొర్రపాడు రోడ్డు విస్తరణకు రూ.8 కోట్లు తక్షణమే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ మార్కెట్ రీమోడలింగ్ పనులను త్వరలోనే పరిష్కరిస్తామని, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల భవన నిర్మాణాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాజోలి, అలగనూరు రిజర్వాయర్ల పనులను కూడా పూర్తి చేసి సాగునీటి సమస్యను తీరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

### ట్రిపుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు

చివరగా, ప్రజల మద్దతును కోరుతూ, "కేంద్రంలో మోడీ గారి నాయకత్వంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పాలనతో డబుల్ ఇంజన్ సర్కార్ బుల్లెట్ వేగంతో దూసుకెళ్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులను గెలిపిస్తే, ట్రిపుల్ ఇంజన్ సర్కార్ వస్తుంది. అప్పుడు అభివృద్ధి మరింత వేగవంతం అవుతుంది. కుట్ర రాజకీయాలను తిప్పికొట్టి, అభివృద్ధికి పట్టం కట్టండి," అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సభకు హాజరైన ప్రజల ఉత్సాహాన్ని చూసి, వారికి ధన్యవాదాలు తెలుపుతూ, "భారత్ మాతా కీ జై, తెలుగు తల్లికి జై" నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించారు.

# ప్రాజెక్టుల గ్రౌండింగ్‌పై ప్రత్యేక దృష్టి



రాష్ట్రానికి వచ్చిన భారీ పెట్టుబడులను కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఎస్ఐపీబీ ద్వారా ఆమోదించిన 388 ప్రాజెక్టుల వల్ల సుమారు 14 లక్షల కోట్ల పెట్టుబడులు, 10,79,000 మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి. విశాఖపట్నం భాగస్వామ్య సదస్సుకు ముందే కనీసం 75 నుంచి 80 శాతం ప్రాజెక్టులను గ్రౌండింగ్ చేయాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేస్తూ పెట్టుబడిదారులకున్న అడ్డంకుల్ని తొలగించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

### ప్రాజెక్టుల ద్వారా ప్రజలకు ఉపాధి

రాష్ట్రంలో ప్రాజెక్టులను గ్రౌండింగ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టుల్లో పరిశ్రమలు, వాణిజ్య రంగానికి చెందినవే అత్యధికంగా ఉన్నాయి. ఈ శాఖకు సంబంధించి 110 ప్రాజెక్టుల ద్వారా 4,91,000 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. వీటి ద్వారా 3,52,000 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థలు ప్రతిపాదించాయి. విద్యుత్ శాఖ పరిధిలో 97 ప్రాజెక్టులు, 4,15,000 కోట్ల పెట్టుబడులతో 4,74,000 ఉద్యోగాలు కల్పించనున్నాయి. ఐటీ శాఖకు చెందిన 83 ప్రాజెక్టుల ద్వారా 4,60,000 కోట్ల పెట్టుబడులతో 2,06,000 మందికి ఉపాధి రానుంది. పర్యాటక రంగంలో 63 ప్రాజెక్టుల ద్వారా 13 వేల కోట్ల పెట్టుబడులతో 22 వేల ఉద్యోగాలు ప్రతిపాదించారు.

ఐ అండ్ ఐ పరిధిలో 5 ప్రాజెక్టులు12 వేల కోట్లతో 8 వేల మందికి, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోని 30 ప్రాజెక్టులు 15 వేల కోట్లతో 17 వేల మందికి ఉపాధి కల్పించనున్నాయి. మొత్తం ఎస్ఐపీబీ ఆమోదించిన పెట్టుబడుల్లో పరిశ్రమలు, ఐటీ, నెడ్‌క్యాప్ ప్రాజెక్టుల వాటానే 98 శాతంగా ఉంది. మొత్తం పెట్టుబడుల్లో పరిశ్రమలశాఖ 35 శాతంతో మొదటి స్థానంలో ఉంది. ఐటీ రంగం 33 శాతం, నెడ్‌క్యాప్ 30 శాతం వాటాతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గత నెలలో జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదించిన 29 ప్రాజెక్టులను మినహాయిస్తే అంతకుముందు జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా 359 ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చారు. వీటిలో 179 ప్రాజెక్టులు శంకుస్థాపన లేదా ఆ తర్వాతి దశల్లో ఉన్నాయి. మరో 180 ప్రాజెక్టులు ప్రభుత్వ జీవోలు, భూసేకరణ ప్రక్రియ దశలో ఉన్నాయి.

"మేము ఇతర రాష్ట్రాల కంటే వేగంగా అనుమతులను మంజూరు చేస్తున్నాము. ఉదాహరణకు గూగుల్ డేటా సెంటర్ కోసం 'ప్రీ-ఫ్యాబ్' (యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి మేము ఫిబ్రవరిలోనే అనుమతులు జారీ చేశాము. భూమికి సంబంధించిన అనుమతులు, పర్యావరణ అనుమతి (జుజ)ఇతర అవసరాలకు సంబంధించిన అనుమతులు కూడా అంతే వేగంగా మంజూరు చేశారు. ఫలితంగా ఆ ప్రీ-ఫ్యాబ్ యూనిట్ నవంబర్‌లో ప్రారంభం కానుంది. భూమి అందుబాటులో ఉన్న చోట మేము వెంటనే దానిని కేటాయిస్తాము. అయితే భూసేకరణ అవసరమైన సందర్భాల్లో కొంత జాప్యం జరుగుతుంది. మేము 9,000 ఎకరాల పట్టా భూమిని సేకరించాలని యోచిస్తున్నాము. ఇందుకోసం రూ.2,500 కోట్ల రుణం తీసుకుంటున్నాం" -యువరాజ్, పరిశ్రమల శాఖ కార్యదర్శి

గ్రౌండింగ్‌కు తీసుకెళ్లాలని ప్రభుత్వం లక్ష్యం : నవంబర్‌లోగా ఈ ప్రాజెక్టుల్లో 75 శాతం గ్రౌండింగ్ చేయించడమే అధికారుల లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం శంకుస్థాపన దశకు చేరుకున్న ప్రాజెక్టుల సంఖ్య 46గా ఉంది. మరో 104 ప్రాజెక్టుల్లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 11 ప్రాజెక్టుల నిర్మాణం పూర్తికాగా 18 ప్రాజెక్టులు ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించాయి. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిన దశలో 123 ప్రాజెక్టులు ఉండగా 57 ప్రాజెక్టులు భూసేకరణ ప్రక్రియలో ఉన్నాయి. 75 శాతం గ్రౌండింగ్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే భూసేకరణ, ఉత్తర్వుల దశలో ఉన్న ప్రాజెక్టుల్లో మరో 90 ప్రాజెక్టులను శంకుస్థాపన దశకు తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు.

పెట్టుబడి ప్రాజెక్టుల నిర్మాణంలో అనుమతుల కారణంగా జాప్యం లేకుండా ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేస్తోంది. భూముల యాజమాన్య హక్కులు పూర్తిగా చేతికి వచ్చిన తర్వాతే అనుమతులు ఇచ్చే పాత విధానానికి భిన్నంగా భూసేకరణ ప్రక్రియకు ముందే అవసరమైన అనుమతులు అందిస్తోంది. భూసేకరణ జరుగుతున్న సమయంలోనే పర్యావరణ అనుమతులు, భవన నిర్మాణాలకు ప్లాన్ అప్రూవల్స్ వంటి ప్రక్రియలను వేగంగా పూర్తి చేస్తోంది. భూములు అందుబాటులో ఉన్నచోట వెంటనే కేటాయింపులు చేయాలని అధికారులు చర్యలు చేపడుతున్నారు. తద్వారా భూములు అప్పగించిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశం ఏర్పడుతోంది. ఈ విధానంతో ప్రాజెక్టులు అనుమతుల దశలోనే ఎక్కువ కాలం నిలిచిపోకుండా గ్రౌండింగ్‌కు తీసుకెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### పనుల పురోగతి పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అనుమతులు వేగంగా ఇస్తున్నామని పరిశ్రమలశాఖ చెబుతోంది. గూగుల్ డేటా సెంటర్ కోసం ప్రీఫ్యాబ్ యూనిట్ ఏర్పాటుకు ఫిబ్రవరిలోనే అనుమతులు ఇచ్చారు. భూములు, పర్యావరణ అనుమతులు, ఇతర క్లియరెన్స్‌లను కూడా వేగంగా పూర్తి చేశారు. మొత్తం 9 వేల ఎకరాల పట్టా భూములు సేకరించాలని ప్రభుత్వం భావిస్తోందని ఇందుకోసం 2 వేల 500 కోట్ల రూపాయల రుణం తీసుకుంటోంది. విశాఖ భాగస్వామ్య సదస్సుకు ముందే పెట్టుబడి, ప్రాజెక్టులను గరిష్ఠ స్థాయిలో గ్రౌండింగ్ చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. 14,06,000 కోట్ల రూపాయల పెట్టుబడులు క్షేత్రస్థాయిలోకి వస్తే భారీగా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. అందుకే అనుమతుల వేగంతో పాటు భూసేకరణ, నిర్మాణ పనుల పురోగతిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది.

## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ - జలజీవన్ మిషన్'కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు. 2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు. తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే

-మొదటిపేజీ తరువాయి

సుపారీ ఇచ్చి సొంత కుటుంబాన్నే బలితీసుకున్న చరిత్ర జగన్‌ది కాదా అని సూటిగా ప్రశ్నించారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలు దర్యాప్తును వేగవంతం చేస్తుంటే, సమాధానం చెప్పలేక జగన్ ముఖం చాటేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఈ కేసును నీరుగార్చారని, పులివెందులలోకి కేంద్ర దర్యాప్తు అధికారులు రాకుండా అడ్డుకున్నది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన ఆరోపించారు.

### అభివృద్ధి, సంక్షేమంలో కూటమి ప్రభుత్వం పరుగులు

ఒకవైపు వైసీపీ విధ్వంసకర రాజకీయాలకు పాల్పడుతుంటే, తమ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కలిసి 61.60 లక్షల కుళాయిల ద్వారా 27.36 లక్షల కుటుంబాలకు తాగునీరు అందించే 'జలజీవన్ మిషన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 'పల్లె పండుగ 3.0' కింద రూ.1,185 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతోందన్నారు. పీఎంఏవై గ్రామీణ్ 2.0 ద్వారా రాష్ట్రంలో రూ.7,170 కోట్లతో పేదలకు మూడు లక్షల పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం సెంటున్నర స్థలం పేరుతో భూదందాలకు పాల్పడితే, తాము పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అర్హులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు.

### రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

రాయలసీమ సాగునీటి కష్టాలను తీర్చడానికి ఎన్టీఆర్ హంద్రీ-నీవా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే, చంద్రబాబు తన పాలనలో నిధులు కేటాయించి కుప్పం వరకు కృష్ణా జలాలను తీసుకువచ్చారని రాంప్రసాద్ రెడ్డి గుర్తుచేశారు. రాయలసీమతో పాటు ప్రకాశం జిల్లాను కలుపుకొని పది జిల్లాలను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. హైదరాబాద్‌లో ఐఎస్‌బీని ఏర్పాటు చేసిన స్ఫూర్తితో, మంత్రి నారా లోకేశ్ చొరవతో దేశంలోనే తొలిసారిగా 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'ను రాష్ట్రానికి తీసుకువస్తున్నామని వెల్లడించారు.

### స్థానిక ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట

తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బీసీలకు అండగా నిలుస్తుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు, అధిక స్థానాలను కేటాయించడానికి కట్టుబడి ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో దౌర్జన్యాలతో స్థానిక సంస్థలను కైవసం చేసుకున్నారని, ఇప్పుడు చట్టబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరుగుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వ సుపరిపాలన, అభివృద్ధి, మెరుగైన శాంతిభద్రతలే తమకు శ్రీరామరక్ష అని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి చంద్రబాబుకు ఘన విజయాన్ని కానుకగా అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట

-మొదటిపేజీ తరువాయి

పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు.
ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

### నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకో వాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకే తికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహిం చాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఓవర్ హెడ్ ట్యాంక్ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే చింతమనేని.







**దెందులూరు, పెన్ సత్తా, అక్టోబర్ 05:** పెదవేగి మండలం పినకడిమిలో రూ. 29 లక్షల ఓవర్ హెడ్ ట్యాంక్ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్. ఈ సంధర్భంగా భూమి పూజ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే చింతనేని ప్రబాకర్ కి గ్రామస్తులు హనంగా హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రంలో ఎమ్మెల్యే చింతనేని మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి కూటమి ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఇరిగేషన్ శాఖ మంత్రి రామానాయుడు ఇచ్చిన మాట మేరకు, రాష్ట్రంలో ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి అందించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా దెందులూరు నియోజకవర్గానికి రూ. 30 కోట్లు మంజూరు చేయగా, పెదవేగి మండలం పినకడిమి గ్రామంలో రూ. 29 లక్షల విలువైన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులకు నేడు భూమి పూజ చేసి పనులను లాంఛనంగా ప్రారంభించడం జరిగింది అని చింతనేని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది గొట్టిపాటి.

- కారుణ్య నియామకాల కింద మరో 43 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేత.
- ప్రజా సానుకూలత పెరిగేలా విధులు నిర్వర్తించాలి మంత్రి గొట్టిపాటి రవికుమార్.



**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 05:** రాష్ట్రంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. స్థానిక ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణ బాబు, విద్యుత్ సంస్థల సీఎండీ లతో కలిసి కారుణ్య నియామకాల కింద ఎంపి కైన 43 మంది బాధితుల కుటుంబ సభ్యులకు సోమవారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటివరకు ఈ విధంగా 450 మందికి పైగా ఉద్యోగాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు ప్రజా సానుకూలత పెరిగేలా, ప్రజలు సంతృప్తి చెందేలా విధులు నిర్వర్తించాలని మంత్రి కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యతనిచ్చే విద్యుత్ శాఖ ద్వారా ప్రజల పై నయా పైసా భారం మోపకుండా వ్యవస్థను గాడిలో పెడుతున్నామని మంత్రి తెలిపారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రతి ఆరు నెలలకోసారి విద్యుత్ చార్జీలు పెంచి విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ఎల్ నినో వంటి తీవ్ర ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, డిపార్ట్‌మెంట్ సిబ్బంది అహర్నిశలు శ్రమించి ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు.

?శాఖ అవసరాలను గుర్తించి, త్వరలోనే 629 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. గతంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు గా పనిచేస్తున్న 7,000 మందికి పైగా డిస్కంల లోకి అధికారికంగా తీసుకున్నామని అన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి వినియోగదారునికి నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా కోట్లాది రూపాయలతో ఆధునికీకరణ పనులు వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ?కేంద్ర ప్రభుత్వ ఆర్‌డీఎస్ఎస్ పథకం అమలు ?పీఎం సూర్య ఘర్ సోలార్ పథకం విస్తరణ భూగర్భ కేబులింగ్ పనులు, నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణం, విద్యుత్ లైన్ల అనుసంధానం తదితర పనులు చేపట్టడం జరుగుతోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను విద్యుత్ రంగంలో దేశం లోనే ఆదర్శంగా నిలబెట్టేందుకు పటిష్ట చర్యలు కొనసాగుతాయని మంత్రి తెలిపారు. ఎం.పి. భరత్ మాట్లాడుతూ కారుణ్య నియామకాలు పొందిన ఉద్యోగులు తమ వృత్తికి, కుటుంబానికి న్యాయం చేయాలని హితవు పలికారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎనర్జీ కమిటీ సభ్యునిగా ఉన్నానని, రానున్న రెండేళ్లు విద్యుత్ నిర్వహణ మీదే దృష్టి పెడతానని అన్నారు. ఈ పి డి సి ఎల్ సి. ఎం.డి ఐ.పృథ్వీ తేజ్ మాట్లాడుతూ ఈ పి డి సి ఎల్ పరిధి 12 జిల్లాల్లో విస్తరించి ఉందని, సుమారు 30 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణ లో మరణించిన, అనారోగ్యం బారిన పడిన వారి కుటుంబాలకు 2024లో 37 మందికి, 2025 లో 77 మందికి, ఈ ఏడాది 43 మందికి కారుణ్య నియామకాలు చేపట్టడం జరిగిందన్నారు. శాఖలో అత్యంత రిస్క్ గల ఉద్యోగాలు ఉన్నందున మరణాలు ఎక్కువగానే సంభవిస్తుంటాయని, బాధిత కుటుంబాలను ఆదుకోవడం జరుగుతోందని తెలిపారు. గాజువాక శాసన సభ్యులు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ఆదుకోవడం లో ఈ ప్రభుత్వం ముందుంటుందని పేర్కొన్నారు. హుద్ హుద్ సమయంలో విద్యుత్ శాఖ ఉద్యోగుల పని తీరు ప్రశంసనీయమని కొనియాడుతూ, ప్రస్తుతం అండర్ గ్రౌండ్ కేబ్లింగ్ జరుగుతోందని, దానిని వేగంగా పూర్తిచేయాలని సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ను తనిఖీ చేసిన మంత్రి.సమావేశం అనంతరం మంత్రి కమాండ్ కంట్రోల్ రూమ్ ను తనిఖీ చేశారు. రోజుకు ఎన్ని కాల్స్ వస్తున్నాయి, వాటికి ఏ విధమైన సమాధానాలు ఇస్తున్నారు అని ఆరా తీశారు. సంబంధిత రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఒక వినియోగదారునితో ఫోన్ ద్వారా మాట్లాడి విద్యుత్ సేవల పై తన అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. విద్యుత్ వినియోగదారులతో మాట్లాడాలని, వారి ఫిర్యాదుల పట్ల వెంట వెంటనే స్పందించాలని సూచించారు. అప్పుడు మాత్రమే ప్రజా సానుకూల దృక్పథం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో పేదలకు సేల్ డీడ్ల పంపిణీ.



**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 05:** ఉత్తర నియోజకవర్గం అక్కయ్యపాలెంలోని షాదీఖానా కళ్యాణ మండపంలో సోమవారం "పేదలకు పట్టాభిషేకం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గోపాలపట్నం మండల పరిధి లోని లబ్ధిదారులకు సేల్ డీడ్లను పంపిణీ చేశారు. ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణు కుమార్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు, విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు భరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీ తేజ్, శ్యామల దీపిక, సునీల్, ఉషా కిరణ్, నజీర్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనలో భాగంగా "సేవా సేతు అభియాన్" కార్యక్రమాన్ని ఉత్తర నియోజకవర్గంలో ప్రారంభించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా అందించే సౌర విద్యుత్ ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సౌర విద్యుత్ వినియోగంతో కలిగే ప్రయోజనాలపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు హాజరై ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పై అవగాహన పొందారు. అనంతరం మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎమ్మెల్యే పి. విష్ణు కుమార్ రాజు తదితరుల చేతుల మీదుగా లబ్ధిదారులకు సేల్ డీడ్లను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ పేదలకు సొంత స్థలం పై హక్కు కల్పించడంతో పాటు వారికి గౌరవ ప్రదమైన జీవనాన్ని అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అర్హులైన పేదలకు పట్టాలు, సేల్ డీడ్ల పంపిణీ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. ఉత్తర నియోజకవర్గంలో ఎమ్మెల్యే పి. విష్ణు కుమార్ రాజు ఆధ్వర్యంలో ఇంత పెద్ద ఎత్తున లబ్ధిదారులకు పట్టాల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అదే విధంగా ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకుని సౌర విద్యుత్ ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవాలని సూచించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు మాట్లాడుతూ పేదలకు భూమి పై హక్కు కల్పించడం వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమేనని అన్నారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు. పార్లమెంట్ సభ్యులు భరత్ మాట్లాడుతూ ప్రతి అర్హుడైన పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సేల్ డీడ్ల ద్వారా లబ్ధిదారులకు వారి ఆస్తి పై చట్టబద్ధ మైన హక్కు లభిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా ప్రతి కుటుంబం సౌర విద్యుత్‌ను వినియోగించుకుని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే పి. విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ, పేదల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. "పేదలకు పట్టాభిషేకం" కార్యక్రమం ద్వారా అర్హులైన పేదలకు సేల్ డీడ్లు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని, సౌర విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో గోపాలపట్నం తాసిల్దార్, ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు, అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడి సొంతింటి కల నిజం చేస్తాం గంటా.



**భీమిలి,పెన్ సత్తా, అక్టోబర్ 05:** రాబోయే మూడేళ్లలో ప్రతి పేదవాడికి సొంతింటి కల నిజం చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం సమావేశం మందిరంలో సోమవారం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ.8,874 కోట్ల విలువైన భూమిని 28 వేల మందికి ఇళ్ల పట్టాల రూపంలో అందించామని, భీమిలి నియోజకవర్గంలో పంపిణీ చేసిన భూమి విలువ రూ.886 కోట్లుగా పేర్కొన్నారు. గత నెల 19 న విశాఖలో, 23 న విజయవాడలో కలిపి 52 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలను ఇచ్చామన్నారు. ఈనెల 4 న 3 డి కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్ లు శ్రీకారం చుట్టారని చెప్పారు. శాశ్వత హక్కులతో ఇచ్చిన స్థలాన్ని అమ్ముకోకుండా నివాసం ఉంటేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరినట్టన్నారు. దేశంలో ఎక్కడా లేని రీతిలో సంక్షేమాన్ని అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈనెల 19 న సీఎం చేతుల మీదుగా పట్టాలు తీసుకోని 79 మంది లబ్ధిదారులకు తన చేతుల మీదుగా అందిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సంగీత్ మాధుర్, ఎమ్మార్వో రామారావు, ఎంపీడీఓ నగేష్, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర, గరే సదానంద, తమ్మిన సూరిబాబు, పాసి నరసింగరావు, జీరు సత్యం, కనకల అప్పలనాయుడు, దండి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం గంటా.



**భీమిలి, పెన్ సత్తా, అక్టోబర్ 05:** క్రీడలకు కూటమి ప్రభుత్వం విశేష ప్రాధాన్యమిస్తోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. భీమిలి ఫుట్ బాల్ గ్రౌండ్స్ లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రగ్బీ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు నగదు, ఇంటి స్థలం, అకాడమీ కోసం భూమి, ప్రభుత్వ ఉద్యోగం వంటి ప్రోత్సాహకాలు ఇస్తున్నామన్నారు. షటిల్ బాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అకాడమీ కోసం విశాఖలో భూమి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడా కోటా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జీవితంలో ఆటుపోట్లు తట్టుకునే శక్తి క్రీడాకారులకు ఎక్కువగా ఉంటుందని, గెలుపు ఓటముల కంటే ఆటల్లో భాగస్వామ్యం కావడం ముఖ్యమన్నారు. శారీరక దృఢత్వంతో ఏకాగ్రత పెరుగుతుందని, నిర్దేశించుకున్న లక్ష్యాన్ని త్వరగా చేరుకుంటారని తెలిపారు. 3 జిల్లాల నుంచి వచ్చిన 200 మంది విద్యార్థులు పాల్గొంటున్న రగ్బీ పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న సన్ స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాస్ ను, జిల్లా ఫిజికల్ డైరక్టర్ల సంఘం కార్యదర్శి లలిత్ కుమార్ ను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ సోమశేఖర్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వహక కార్యదర్శి ఎన్.ఎస్.జి. వర్మ, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, జీరు కైలాష్ రెడ్డి, శాఖారి శ్రీనివాస్, గాడు వెంకటప్పడు, సరగడ అప్పారావు, తాట్రాజు అప్పారావు, ఎల్.వి.రమణ, రామానాయుడు, కసిరెడ్డి దామోదరరావు, రామరాజు, గరే గుర్నాథ్, మన్యాల సోంబాబు, నాగోతి శివాజీ, చెట్టుపల్లి గోపీ, బోని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**ధర్మవరం,అక్టోబర్ 05 (పెన్ సత్తా)**స్థానిక రేగాటిపల్లి రోడ్డు నందు గల శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్ మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పట్ల గౌరవం,కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేసి,పలు కార్యక్రమాల ద్వారా తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను సన్మానించి,వారికి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ రమేశ్ పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిసింది.

## సస్య గణపతి మొక్కల పంపిణీ ప్రారంభించిన కొణతాల.

- పర్యావరణ పరి రక్షణకు వినూత్న సందేశం.
- భక్తులను ఆకట్టుకున్న సస్య గణపతి.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 05:** పట్టణం లోని ప్రసిద్ధ చింతామణి గణపతి ఆలయంలో వినాయక చవితి సందర్భంగా 21 వ నవరాత్రులు మహోత్సవాలు వినూత్నంగా మొక్కలతో రూపొందించిన సస్య గణపతి విగ్రహానికి మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతామణి గణపతి ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కి పూర్ణకంభం, మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. మొక్కలతో ప్రత్యేకంగా రూపొందిస్తున్న సస్య గణపతి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరి రక్షణ ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు, ఆ మొక్కలను ప్రజలకే వితరణ చేసే కార్యక్రమం చేపట్టినట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రకృతిని పరి రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని సస్య గణపతి ద్వారా మొక్కలను ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. పర్యావరణహిత ఆలోచనతో ఏర్పాటు చేసిన ఈ గణపతి భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చింతామణి గణపతి ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## చైల్డ్ రిస్క్యూస్, చైల్డ్ అబ్యూస్, భిక్షాటన చేస్తున్న పిల్లలను చైల్డ్ హోమ్స్ లో సంరక్షణ కల్పించాలి.

- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 05:** అనకాపల్లి జిల్లాలో చైల్డ్ రిస్క్యూస్, చైల్డ్ అబ్యూస్, భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి చైల్డ్ హోమ్స్ లో చేర్పించి వారికి సంరక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. మహిళా అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎనిమిది మంది సిబ్బందితో చైల్డ్ హెల్ప్ లైన్ ఏర్పాటు చేయబడింది.సదరు సభ్యులు సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్ లైన్ సభ్యులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎటువంటి చైల్డ్ ఇష్యూస్ రాకుండా పనిచేయాలని తెలిపారు. రైల్వే స్టేషన్ కాంప్లెక్స్ లలో చైల్డ్ రిస్క్యూస్, చైల్డ్ అబ్యూస్, భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి వారిని సంబంధిత చైల్డ్ హోమ్స్ లో సంరక్షణ కల్పించడం తదితర విధులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు వచ్చిన కాల్స్ పై జిల్లాలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు పిల్లల పై జరగకుండా చూడాలన్నారు.

1).జిల్లా కోఆర్డినేటర్(o919441681942), 2).ముగ్గురు సోషల్ వర్కర్స్, 3).ముగ్గురు కేస్ వర్కర్స్, 4). ఒక కౌన్సిలర్.

పై సిబ్బంది అందరూ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఆధ్వర్యంలో పనిచేస్తారని, జిల్లాలో పిల్లల పై ఎటువంటి ఫిర్యాదులు ఉన్న పై నెంబర్లకు తెలియజేసినా, లేదా నేరుగా జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ కార్యాలయము నూకాంబిక గుడి దగ్గర ఉన్న కార్యాలయమును సంప్రదించినా తగు చర్యలు తీసుకుంటున్నట్లు, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఎన్. సూర్యలక్ష్మి. జిల్లా కలెక్టర్ కు వివరించారు.

## దేవి శరన్నవరాత్రుల కరపత్రాన్ని ఆవిష్కరించిన కమిటీ సభ్యులు.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 05:** పట్టణంలో ప్రసిద్ధి చెందిన కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సోమవారం ఆలయ మండపంలో దేవి శరన్నవరాత్రుల కరపత్రాన్ని కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. గత ఏడాది వలె ఈ ఏడాది కూడా దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వుప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శి, శ్రీధరాల సోమరాజు, కోశాధికారి కడిమిశెట్టి అచ్యుతరామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి వివిఎస్ మాణిక్యం, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# బాలల ఆరోగ్యమే రాష్ట్ర భవిష్యత్తుకు పునాది మంత్రి గుమ్మిడి.

- అంగన్ వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత.
- 55,776 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 23.17 లక్షల మందికి అనుబంధ పోషకాహారం.
- అంగన్‌వాడీల బలోపేతానికి రూ.99.58 కోట్లతో మౌలిక సదుపాయాలు.
- 21.50 లక్షల మంది చిన్నారులకు ఏఐ ఆధారిత అభివృద్ధి పరీక్షలు.
- 4,687 మినీ అంగన్ వాడీ లను ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్.
- ప్రీ-స్కూల్ పిల్లల హాజరు 76.98 నుంచి 88 శాతానికి పెంపు.
- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి.



**గన్నవరం, పెన్ సత్తా, అక్టోబరు 05:** రాష్ట్రం లోని ప్రతి చిన్నారికి పౌష్టికాహారం అందించడం, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరి రక్షణ, అంగన్ వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గన్నవరం లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ప్రార్థనా మందిరంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 9 వ రాష్ట్రీయ పోషణ మాస్--2026 రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ. సూర్యకుమారి, శాఖ డైరెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు, కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి తిలకించారు. కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో జిల్లాలో ఒక్కో రోజు నిర్వహిస్తున్న రాష్ట్రీయ పోషణ మాస్ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో గన్నవరంలో నిర్వహించడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో మొత్తం 55,776 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, వాటి పరిధిలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు కలిపి సుమారు 35 లక్షల మంది సేవలు పొందుతున్నారని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వం లోని ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంగన్ వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆర్ఓ ప్లాంట్లు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు, ఆట పరికరాలు, ఎల్ఈడీ టీవీలు, పోషణ్ వాటికలు తదితర సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. అంగన్ వాడీ కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్లు అందించడంతో పాటు వారి సంక్షేమానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సురక్షితంగా, ఆరోగ్యకర మైన వాతావరణంలో విద్యను అభ్యసించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో 5,389 కార్యకర్తలు, 4,061 సహాయకుల పోస్టులు కలిపి మొత్తం 9,450 పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం 1,066 అంగన్‌వాడీ కార్యకర్తలు, 4,250 సహాయకుల పోస్టులు నోటిఫికేషన్ దశలో ఉన్నాయని, మొత్తం 5,316 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు సిబ్బంది నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

పోషకాహార కార్యక్రమాల ఫలితంగా 5 సంవత్సరాల లోపు పిల్లల్లో స్టంటింగ్ 20.68 శాతం నుంచి 8.77 శాతానికి, అండర్‌వెయిట్ 9.75 శాతం నుంచి 4.76 శాతానికి, వేస్టింగ్ 5.61 శాతం నుంచి 3.08 శాతానికి తగ్గినట్లు తెలిపారు.రాష్ట్రం లోని 55,776 అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, ప్రెషర్ కుక్కర్లు, మూతలతో కూడిన బాణలులు, పాత్రలను రూ.40.89 కోట్ల వ్యయంతో సరఫరా చేసినట్లు మంత్రి తెలిపారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌లో భాగంగా రూ.72 కోట్లతో 58,204 స్మార్ట్‌ఫోన్లను అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, బ్లాక్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లకు అందించినట్లు వెల్లడించారు. అలాగే 13,916 మరుగుదొడ్లు, 15,521 తాగునీటి కనెక్షన్లు/సదుపాయాల కోసం రూ.64.34 కోట్లు విడుదల చేయగా, ఇప్పటి వరకు 9,209 మరుగుదొడ్లు, 12,131 తాగునీటి సదుపాయాల పనులు పూర్తయ్యాయని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యాలను పెంపొందించేందుకు 54,468 మందికి పోషణ్ భీ పడాయి భీ కార్యక్రమం కింద శిక్షణ ఇచ్చామని, ఇందుకోసం రూ.8.50 కోట్లు వినియోగించామని తెలిపారు. మహిళల రక్షణ, సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ.6 కోట్లతో 11 వన్‌స్టాప్ సెంటర్ల భవనాలకు భూమిపూజ నిర్వహించినట్లు తెలిపారు. బాధిత మహిళలకు సహాయ, పునరావాస నిధి నుంచి 3,673 మందికి రూ.15.14 కోట్ల పరిహారం పంపిణీ చేసినట్లు వెల్లడించారు. పని చేసే మహిళలకు సౌకర్యాలు కల్పించేందుకు విశాఖపట్నంలో మూడు వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల నిర్మాణానికి రూ.113.52 కోట్లు విడుదలై నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగడానికి తొలి దశ నుంచే సరైన పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, విద్య అందించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ...రాష్ట్ర స్థాయి రాష్ట్రీయ పోషణ మాస్ కార్యక్రమానికి గన్నవరం వేదిక కావడం సంతోషకరమని అన్నారు. 2024 జూన్ 12 న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రివర్గ సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేసిన గన్నవరం వేదిక పైనే రాష్ట్ర స్థాయి పోషణ కార్యక్రమం నిర్వహించడం ప్రత్యేకతను సంతరించుకుందని తెలిపారు. గన్నవరం నియోజకవర్గం లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని ఎమ్మెల్యే కోరారు. డీఎంఎఫ్ నిధులతో 40 అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీ గోడలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని, అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను పూర్తి చేసేందుకు అవసర మైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా గన్నవరం నియోజకవర్గంలో ఎస్‌టీ సంక్షేమానికి సంబంధించి ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. గత ప్రభుత్వంతో పోలిస్తే అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయని యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీసం పిల్లలకు అవసరమైన ప్లేట్లు, గ్లాసులు కూడా అందుబాటులో లేని పరిస్థితి ఉండగా, ప్రస్తుతం ప్రభుత్వం వాటిని అందించడంతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కూడా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి సుజాత రాణి, జాయింట్ డైరెక్టర్ కే ప్రవీణ, జాయింట్ పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ ఎస్ సునంది, ఐసిడిఎస్ పిడి ఐ విమల, సంబంధిత శాఖల అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో రైతుల గోడు పట్టించుకోరా..?

జిల్లా లోని అన్ని మండలాలు తీవ్ర కరువు మండలంగా ప్రకటించాలి.
రైతు కన్నీటి చుక్క నేల పై పడనివ్వం..
అన్నదాతలకు అండగా ఉషశ్రీ చరణ్ పోరాటం..



**పెనుగొండ, పెన్ సత్తా, అక్టోబర్ 05:** శ్రీ సత్యసాయి జిల్లా లోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు, వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉషశ్రీ చరణ్ నిరసన చేపట్టి, తహసీల్దార్ కి వినతిపత్రం అందజేశారు. శ్రీ సత్యసాయి జిల్లా తీవ్ర కరువు పరిస్థితులతో అల్లాడుతున్నా కూటమి ప్రభుత్వం కనీసం పట్టించు కోవడం లేదని మాజీ మంత్రి, వైయస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ... రొద్దం మండలంలో వర్షపాతం అత్యల్పంగా ఉండటంతో బోర్లు ఎండిపోయి, పెన్నా నదిలో నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రొద్దం మండలాన్ని కేవలం మధ్యస్థ కరువు మండలంగా కాకుండా తీవ్ర కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. క్షేత్ర స్థాయిలో పంట నష్టం, వర్షపాతం, భూ గర్భ జలాల పరిస్థితిని పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వ బృందాన్ని రప్పించాలని కోరారు. అక్టోబర్‌లో జరిగే తదుపరి మూల్యాంకనంలో రొద్దం మండలాన్ని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని రైతుల వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని వైయస్ఆర్ సీపీ తరఫున డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీల్లోనే ఇంకా భారీగా బకాయిలు ఉన్నాయని, పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరానికి రూ.25 వేలు, పంటలు వేయలేని రైతులకు రూ.15 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఇప్పటికే డిమాండ్ చేసిన విషయాన్ని ఉషశ్రీ చరణ్ గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో రైతుల పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించిందని, నేడు రైతుల పై అదనపు భారాలు మోపుతున్నారని విమర్శించారు. రైతులు కరువుతో అల్లాడుతుంటే స్థానిక ప్రజా ప్రతినిధులు ఏం చేస్తున్నారని ప్రశ్నించిన ఉషశ్రీ చరణ్. ప్రజల ఓట్లతో పదవులు పొందిన మంత్రి సవిత, ఎంపీ పార్థ సారథి ఇప్పుడు రైతుల పక్షాన నిలబడి తమ బాధ్యతను నిర్వర్తించాలని డిమాండ్ చేశారు. రొద్దం రైతుల సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత మంత్రి, ఎంపీ పై ఉందని స్పష్టం చేశారు. రైతులు కన్నీరు పెడుతుంటే వారి తరఫున మాట్లాడాల్సిన సమయంలో మౌనం ఎందుకు..?, రైతుల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా పదవులు కాదా..? అని ఉషశ్రీ చరణ్ నిలదీశారు. రొద్దం మండలానికి చెందిన ఎంపీ పార్థ సారథి కనీసం ఇప్పటి కైనా ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, మంత్రి సవిత రొద్దం రైతుల పరిస్థితి పై ప్రత్యేక దృష్టి పెట్టి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరో వైపు పెన్నా నది, చెరువుల్లో నీరు లేకపోవడం, ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాలు మరింత అడుగంటిపోతున్నాయని ఉషశ్రీ చరణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ తరలింపు పై తూతూమంత్రంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, నీటి వనరుల పరి రక్షణ పై ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కరువు కారణంగా పశువులకు మేత కూడా దొరకక రైతులు తమ పశు వులను అమ్ముకునే దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేసిన ఉషశ్రీ చరణ్. ప్రతి మండలంలో తక్షణమే పశు గ్రాసం ఏర్పాటు చేయాలని కోరారు. రైతులు పశువులను అమ్ముకోవడం మొద లైతే చివరకు గ్రామాలను వదిలి వలస వెళ్లే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. రైతు బతికితేనే గ్రామం బతుకుతుంది. గ్రామం బతికితేనే రాష్ట్రం బతుకుతుంది. రైతులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఇప్పటి కైనా కూటమి ప్రభుత్వం స్పందించి రొద్దం మండలాన్ని తీవ్ర కరువు మండలంగా ప్రకటించి, కేంద్ర బృందాన్ని రప్పించి క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితిని పరిశీలించి న్యాయం చేయాలని, మంత్రి సవిత, ఎంపీ పార్థ సారథి రైతుల పక్షాన నిలబడి తక్షణమే చర్యలు చేపట్టాలని ఉషశ్రీ చరణ్ వైయస్ఆర్ సీపీ తరఫున డిమాండ్ చేశారు.

# అచ్యుతాపురంలో 220 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్ ప్రారంభం.

- పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక వసతుల విస్తరణ.
- పరిశ్రమలకు నాణ్య మైన విద్యుత్ సరఫరానే ప్రభుత్వ లక్ష్యం.
- పటిష్ట మైన విద్యుత్ వ్యవస్థ కారణంగానే రాష్ట్రానికి పెట్టుబడులు.
- ముఖ్యమంత్రితో చర్చించిన అనంతరం లైన్ మెన్ల పోస్టుల భర్తీ.
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్.

**అచ్యుతాపురం, పెన్ సత్తా, అక్టోబర్ 05:** జిల్లాలో పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం ప్రాంతంలో విద్యుత్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రూ.77.29 కోట్ల వ్యయంతో ఏపీ ట్రాన్స్‌కో నిర్మించిన 220 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్‌ను సోమవారం ఉదయం ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ప్రగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ అచ్యుతాపురం ప్రాంతంలో పెరుగుతున్న గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సబ్‌స్టేషన్‌ను నిర్మించినట్లు తెలిపారు. దీని ద్వారా వినియోగదారులకు మరింత నాణ్య మైన, నమ్మక మైన విద్యుత్ సరఫరా అందుబాటు లోకి వస్తుందని చెప్పారు. భవిష్యత్ పారిశ్రామిక అవసరాలను ముందుగానే అంచనా వేసి విద్యుత్ మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. పరిశ్రమలు రాష్ట్రానికి తరలిరావాలంటే పటిష్ట మైన విద్యుత్ వ్యవస్థ కీలకమని, మెరుగైన విద్యుత్ మౌలిక సదుపాయాలు ఉన్న ప్రాంతాల్లోనే పారిశ్రామిక పెట్టుబడులకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. పారిశ్రామిక అవసరాల కోసం విద్యుత్ శాఖ సుమారు రూ.1,816 కోట్ల మేర వ్యయం చేస్తోందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఈ ప్రాంతంలో మరో మూడు సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అచ్యుతాపురం 220 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి 2018 లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి గుర్తుచేశారు. అనంతరం అధికారం లోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఏషియన్ డెవలప్ మెంట్ బ్యాంక్ (ఏడీబీ) నిధులను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. గత ప్రభుత్వం ఒక్క సబ్‌స్టేషన్‌ను కూడా పూర్తిచేయకుండా పలు సబ్ స్టేషన్ల నిర్మాణ పనులను అర్థాంతరంగా నిలిపివేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు విద్యుత్ రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. బలమైన విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోందని పేర్కొన్నారు. లైన్‌మెన్ పోస్టుల భర్తీ పై త్వరలో నిర్ణయం. క్షేత్ర స్థాయి పర్యటనల్లో భాగంగా విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌ల కొరత తమ దృష్టికి వచ్చిందని గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఇప్పటికే ఏఈ పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసి 629 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. లైన్‌మెన్ పోస్టుల భర్తీ పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.







# ఇండోర్ స్టేడియంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.



- యువత క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇండోర్ స్టేడియం దోహదం చేస్తుంది.
- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ.

**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 05:** యువత క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇండోర్ స్టేడియం ఎంతగానో దోహదం చేస్తుందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. అనకాపల్లి పట్టణంలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియంను సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎన్‌టీపీసీ ఈడీ అయస్కాంత్ జెనా లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ ఇండోర్ స్టేడియం అనకాపల్లి ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. యువత క్రీడల్లో రాణించేందుకు, తమ ప్రతిభను మెరుగు పరుచుకునేందుకు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇండోర్ స్టేడియంను ప్రతి ఒక్కరూ తమ సొంత ఆస్తిగా భావించి జాగ్రత్తగా, సక్రమంగా వినియోగించు కోవాలని అన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా స్టేడియం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రభుత్వ, ప్రజా ఆస్తులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ అనకాపల్లి పట్టణ ప్రజలకు మెరుగైన క్రీడా సదుపాయాలను అందుబాటు లోకి తీసుకురావడంలో రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం కీలకంగా నిలుస్తుందని అన్నారు. యువత క్రీడల పై ఆసక్తి పెంచుకుని ఆరోగ్యకర మైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. స్టేడియం లోని సౌకర్యాలను నిబంధనల ప్రకారం వినియోగించుకుంటూ వాటి నిర్వహణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతంలో క్రీడా మౌలిక వసతులను బలోపేతం చేయడంలో ఈ ఇండోర్ స్టేడియం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. యువత లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు, క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, సాధనకు ఈ సదుపాయం ఉపయోగపడుతుందని అన్నారు. స్టేడియంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్‌టీపీసీ సింహాద్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అయస్కాంత్ జెనా మాట్లాడుతూ అనకాపల్లిలో క్రీడా మౌలిక వసతులను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని జిల్లా యంత్రాంగం గుర్తించడంతో, ఎన్‌టీపీసీ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్సార్) కార్యక్రమంలో భాగంగా రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం పునరాభివృద్ధికి సహకరించిందని తెలిపారు. సుమారు రెండు కోట్ల రూపాయలతో స్టేడియంను ఆధునిక క్రీడా సదుపాయంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, జీవీఎంసీ అధికారులు, ఎన్‌టీపీసీ ప్రతినిధులు, క్రీడాకారులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛాంధ్ర అవార్డుల ఘనత మీ అందరిదీ వెంకటరావు.

- శానిటేషన్ సిబ్బందికి పూలమాలలతో ఘన సత్కారం.
- ఇక పై బాధ్యత మరింత పెరిగింది, మరిన్ని అవార్డులు సాధించాలి.

**సింహాచలం, పెన్ సత్తా, అక్టోబర్ 05:** వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రతిష్టాత్మక 'స్వచ్ఛాంధ్ర' అవార్డులు దక్కడం వెనుక పారిశుధ్య సిబ్బంది, శానిటేషన్ కార్మికుల అంకితభావం, నిరంతర కృషి ఎంతో కీలకమని దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు అన్నారు. స్వచ్ఛతలో సింహాచలం దేవస్థానానికి రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా 'స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర' అవార్డు లభించడం, అలాగే జిల్లా స్థాయి లోనూ ప్రతిష్టాత్మక అవార్డు దక్కిన నేపథ్యంలో సోమవారం దేవస్థానం ఈవో ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సత్కరించారు. ధర్మకర్త మండలి సభ్యులు, కరక దేవుడు, ఉషశ్రీ తో కలిసి శానిటేషన్ సిబ్బందికి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఈవో జల్లేపల్లి వెంకటరావు మాట్లాడుతూ.. సింహాచల దేవస్థానానికి లభించిన అవార్డులు ఏ ఒక్కరి వ్యక్తిగత విజయాలు కావని, ప్రతి ఒక్క ఉద్యోగి, సిబ్బంది, శానిటేషన్ కార్మికుడి సమష్టి కృషికి దక్కిన గౌరవమని అన్నారు. కొండ పై పరిశుభ్రతను కాపాడుతూ, భక్తులకు ఆహ్లాదకర మైన వాతావరణాన్ని అందించేందుకు శానిటేషన్ సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఇప్పటివరకు సాధించిన విజయంతో మన బాధ్యత పూర్తయినట్లు కాదు, ఇక పై మన పై మరింత బాధ్యత పెరిగింది. ఈ అవార్డు మనందరికీ మరింత స్ఫూర్తినివ్వాలి. ఇదే ఉత్సాహంతో మరింత కష్టపడి పనిచేసి సింహాచల దేవస్థానానికి భవిష్యత్తులో మరెన్నో రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు తీసుకురావాలి అని ఈవో సిబ్బందికి పిలుపునిచ్చారు. స్వచ్ఛత అనేది కేవలం ఒక విభాగానికి సంబంధించిన బాధ్యత కాదని, ఆలయ అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది, అర్చకులు, భక్తులు ప్రతి ఒక్కరూ భాగస్వాములైనప్పుడే సంపూర్ణ పరిశుభ్రత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు సింహాచల క్షేత్రాన్ని మరింత పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఇటీవల సింహాచల దేవస్థానానికి రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా 'స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర' అవార్డు లభించగా, జిల్లా స్థాయిలో విశాఖపట్నం జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ చేతుల మీదుగా దేవస్థాన ఏఈవో పిల్లా శ్రీనివాసరావు, డీఈ (ఇన్‌చార్జి) రామరాజు అవార్డును అందుకున్నారు. ఒకేసారి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో సింహాచల దేవస్థానానికి స్వచ్ఛత అవార్డులు దక్కడం పట్ల శానిటేషన్ సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. తమ సేవలను గుర్తించి ఈవో స్వయంగా సత్కరించడం తమకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఇక పై మరింత అంకితభావంతో పనిచేసి సింహాచలం దేవస్థానానికి మరిన్ని అవార్డులు వచ్చేలా కృషి చేస్తామని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో సింగం రాధా, సహాయ కార్య నిర్వహణ అధికారి వాడ్రేవు రమణమూర్తి, పిల్లా శ్రీనివాసరావు, డిప్యూటీ ఇంజనీర్ రామరాజు, దేవస్థాన అధికారులు, ధర్మకర్త మండలి సభ్యులు, శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# త్రాగునీటికి సుమారు 12 కోట్లు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం బండారు.

- మెర్లపాలెంలో 20 లక్షల వ్యయంతో నిర్మించే వాటర్ ట్యాంక్ నిర్మాణం.
- వాటర్ ట్యాంక్ కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.




**కొత్తపేట, పెన్ సత్తా, అక్టోబర్ 05:** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో త్రాగునీటి కోసం 11 కోట్ల 80 లక్షల రూపాయల నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే సత్యానంద రావు తెలిపారు. ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న ఓ హెచ్ ఎస్ ఆర్ ట్యాంక్ కు సత్యానందరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి జలధార పథకంతో సురక్షిత తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా కొత్తపేట నియోజకవర్గంలో మొత్తం 16 పనులకు 11 కోట్ల 80 లక్షల రూపాయలతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలమూరు మండలంలో 322.35 లక్షలు, ఆత్రేయపురం మండలంలో 36.34 లక్షలు, కొత్తపేట మండలంలో 338.49 లక్షలు, రావులపాలెం మండలంలో 482.52 లక్షలు మంజూరయ్యాయనారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కలసి అమరజీవి జలధార పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి గ్రామంలో ఈ రోజు అమరజీవి జలధార పథకం ప్రారంభిస్తున్నట్టు ఎమ్మెల్యే సత్యానంద రావు తెలిపారు. ఈ కార్యక్రంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గన్నవరం సీహెచ్‌సీ రూపురేఖలు నెల రోజుల్లో మార్చాలి ఎమ్మెల్యే యార్లగడ్డ.

- సీహెచ్‌సీ అభివృద్ధికి సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలి యార్లగడ్డ.
- అన్ని అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి యార్లగడ్డ.



**గన్నవరం, పెన్ సత్తా, అక్టోబర్ 05:** సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) రూపురేఖలు నెల రోజుల్లో మారేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. సీహెచ్‌సీలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆహ్లాదకర మైన వాతావరణం కల్పించేలా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ మేరకు గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని అధికారులతో కలిసి పరిశీలించిన ఆయన, అభివృద్ధి పనులు ఏ విధంగా చేపట్టాలనే దాని పై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో రహదారుల అభివృద్ధి, పచ్చదనం పెంపు, క్యాజువాలిటీ భవన నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ, ఇతర అవసరమైన మౌలిక వసతుల కల్పన తదితర పనులన్నింటినీ సమగ్రంగా పరిశీలించి ఒకే మాస్టర్ ప్లాన్‌లో పొందుపరచాలని తెలిపారు. సీహెచ్‌సీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రాధాన్య క్రమాన్ని నిర్ణయించి, ఏ పని ఎప్పుడు ప్రారంభించాలి, ఎప్పటిలోగా పూర్తి చేయాలనే దాని పై స్పష్ట మైన కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా క్యాజువాలిటీ భవన నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు ఇబ్బందులు లేకుండా రహదారులు, పార్కింగ్, పచ్చదనం తదితర సౌకర్యాలను మెరుగుపరచాలని చెప్పారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేలా అవసర మైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీహెచ్‌సీ అభివృద్ధికి అవసర మైన అన్ని అంశాలను ఒకే ప్రణాళికలో భాగంగా రూపొందించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. నిర్ణయించిన పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని, నెల రోజుల్లో సీహెచ్‌సీలో స్పష్టమైన మార్పులు కనిపించేలా పనుల పురోగతి ఉండాలని ఆదేశించారు. గన్నవరం ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడమే లక్ష్యంగా సీహెచ్‌సీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# విదేశీయులు డిజిటల్ రూపంలో వివరాలు నమోదు చేయాలి జిల్లా ఎస్పీ

- ఫారం-సి ద్వారా 24 గంటల్లోగా ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి.
- ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు, రూ. 50 వేల నుండి లక్ష వరకు జరిమానా, జైలు శిక్ష.
- ఓసీఐ, నేపాల్, భూటాన్ పౌరుల బస వివరాలూ నమోదు చేయాల్సిందే.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 05:** అనకాపల్లి జిల్లా పరిధి లోకి విద్య, వైద్యం, పర్యాటకం, వ్యాపారం, ఉపాధి లేదా వ్యక్తిగత పనుల నిమిత్తం వచ్చే విదేశీయులకు ఆశ్రయం లేదా వసతి కల్పించే అన్ని యాజమాన్యాలు, వ్యక్తులు తప్పనిసరిగా వారి రాక, నిష్క్రమణ వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేయాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధి లోని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్, హైదరాబాద్ ఆదేశాలు, ది ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025 (సెక్షన్ 8) నిబంధనల ప్రకారం జిల్లా లోని ప్రతి ఒక్కరూ ఈ చట్టపర మైన బాధ్యతను తప్పక పాటించాల్సి ఉంటుంది. అందులో ముఖ్యమైన నిబంధనలు ఉ మార్గదర్శకాలు: పరిధి లోకి వచ్చే వసతి కేంద్రాలు: హోటళ్లు, రిసార్టులు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు. ఎయిర్ బీఎన్‌బీ, హోమ్‌స్టేలు, సర్వీస్ అపార్ట్‌మెంట్లు.

ప్రైవేట్ అద్దె ఇళ్లు, పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతులు, బంధువుల ఇళ్లు. ఆసుపత్రులు, మెడికల్/ఆయుష్ చికిత్సా కేంద్రాలు. విద్యాసంస్థలు, కాలేజీలు, యూనివర్సిటీలు, పాఠశాలల హాస్టళ్లు. మఠాలు, ఆశ్రమాలు, మదర్సాలు, కాన్వెంట్లు వంటి మతపరమైన సంస్థలు. వాణిజ్యపర మైన లేదా వాణిజ్యేతర, ప్రాతిపదికన విదేశీయులకు బస కల్పించే ప్రతి ఒక్కరికీ ఈ నిబంధన వర్తిస్తుంది. ?24 గంటల్లోగా ఫారం-సి (ఫారం-×××/ఫారం-సి) సమర్పణ: విదేశీయులు చేరిన సమయం నుండి 24 గంటల లోపు పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలి. అలాగే వారు ఖాళీ చేసి వెళ్లేటప్పుడు కూడా నిష్క్రమణ వివరాలను తప్పక అప్‌డేట్ చేయాలి. అతిథుల రికార్డులను సంబంధిత యాజమాన్యం కనీసం 1 సంవత్సరం పాటు భద్రపరచాలి. విదేశీయులతో పాటు ఓసీఐ (ఓసిఐ) కార్డుదారులు, నేపాల్, భూటాన్ దేశస్థులు బస చేసినప్పటికీ ఈ వివరాలు సమర్పించాలి. రిజిస్ట్రేషన్, పోర్టల్ వివరాలు: అధికారిక పోర్టల్: హ్ట్ప్జూం://అఅఎఖుఅటతీశీ.స్రశీజ.అఅ లేదా సంబంధిత ఫారం-సి పోర్టల్. నమోదు విధానం: పోర్టల్‌ను సందర్శించి "సైన్ అప్ / రిజిస్ట్రేషన్ పై క్లిక్ చేయాలి. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్, చిరునామా, హోస్ట్ వివరాలు నమోదు చేయాలి. దరఖాస్తును ప్రింట్ తీసి, సంతకం చేసి అవసర మైన పత్రాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ఎఫ్.ఆర్.ఆర్.ఓ ఆమోదం పొందిన తర్వాత వచ్చే లాగిన్ వివరాలతో 24 గంటల్లోగా అతిథుల వివరాలు నమోదు చేయవచ్చు. ఉల్లంఘనలకు చట్టపర మైన శిక్షలు (సెక్షన్ 23 బి ప్రకారం): విదేశీయుల వివరాలు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహించినా లేదా నిబంధనలు అతిక్రమించినా తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు. వ్యక్తులు, ప్రైవేట్ లేదా వాణిజ్యేతర వసతుల నిర్వాహకులకు కనీసం రూ.50,000 నుండి జరిమానాతో పాటు క్రిమినల్ ప్రాసిక్యూషన్. ఆసుపత్రులు, విద్యాసంస్థలు, హోటళ్లకు కనీసం రూ.1,00,000 నుండి జరిమానాతో పాటు క్రిమినల్ ప్రాసిక్యూషన్. చెల్లుబాటు అయ్యే వీసా, పాస్ పోర్ట్ లేకుండా ఆశ్రయం కల్పించినా లేదా నకిలీ పత్రాలకు సహకరించినా 2 నుండి 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు రూ.1,00,000 నుండి రూ.10,00,000 వరకు భారీ జరిమానా విధించే అవకాశం ఉంది.

విదేశీయులు పాటించాల్సిన అంశాలు : భారతదేశ చట్టాలను తప్పనిసరిగా గౌరవించాలి. అనుమతించిన వీసా గడువు ముగిసిన తర్వాత (ఓవర్ స్టెయింగ్) దేశంలో ఉండకూడదు. సరైన వీసా అనుమతులు లేకుండా ఎలాంటి అనధికారిక వ్యాపారాలు లేదా ఉద్యోగాలు చేయరాదు. విదేశాల్లో స్థిరపడిన ఓ.సి.ఐ. కార్డుదారులు దేశంలో జరిగే ఎన్నికల్లో ఓటు వేయడం, పోటీ చేయడం లేదా వ్యవసాయ భూములు కొనుగోలు చేయడం చట్ట రీత్యా నిషేధం. చిరునామా మారినట్లయితే వెంటనే ఫర్రో కి తెలియజేయాలి. జాతీయ భద్రత దృష్ట్యా, స్థానిక ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా నివసిస్తున్న విదేశీయులను గమనిస్తే వెంటనే సమీపం లోని పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112 జిల్లా పోలీస్ కార్యాలయానికి సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. అధికారిక సంప్రదింపుల వివరాలు (ఫర్రో హైదరాబాద్), ఈ-మెయిల్:లి టతీశీశ్రఎఎఅఅఎ.ఇన్, ఫోన్ నంబర్లు: 040-29880374, 040-29880375, కార్యాలయం బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ (బిఓఐ), ఎస్విపి బిఓఐ కాంప్లెక్స్, శంషాబాద్, హైదరాబాద్ - 501218.

# గోర్జు ఆక్రమణలు తొలగించి పంట భూములను కాపాడాలి





సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావు వెంకట జగ్గారావు

**నక్కపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 05:**గోర్జు ఆక్రమణలు తొలగించి పంట భూములను కాపాడాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రావు వెంకట జగ్గారావున్నారు.నక్కపల్లి మండలం, రేబాకలో సర్వే నెంబర్ 147 లో 14 ఎకరాల పంట భూములు ఉన్నాయని తెలిపారు. 14 ఎకరాల పంట భూములలో చేరిన మిగులు నీరు ముకుందరాజుపేట గ్రామం సర్వే నంబర్ 29 లోని పంట కాలువల ద్వారా గెడ్డలోకి కలవాల్సి ఉందని, అయితే ఇటీవల కాలంలో గోర్జు మొత్తం ఆక్రమణకు గురై నిర్మాణాలు చేపట్టడం వల్ల పంట భూమిలో చేరిన మిగులు నీరు గోర్జు ద్వారా బయటకు వెళ్లే మార్గం లేక పంట భూమి అంతా మునిగిపోతుందని తెలిపారు. పంట భూమిలో చేరిన నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపించే పనులు చేస్తున్నప్పటికీ భూమిలో నీరు ఎక్కువగానే చేరడం వల్ల పంటలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని గోర్జ పై ఆక్రమణలు తొలగించి, మిగులు నీరు బయటకు వెళ్లేలా, పంట భూములను కాపాడేలే చర్యలు తీసుకోవాలని సోమవారం నక్కపల్లి తహసిల్దార్ చిన్ని కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు పాల్గొన్నారు.

# అమలాపురం గ్రామంలో భూముల చుట్టూ స్టీల్ ప్లాంట్ పరిశ్రమ ఫెన్సింగ్ ఆపాలి

కె.వెంకటేష్ కు వినతిపత్రం ఇచ్చిన రైతులు

**నక్కపల్లి,పెన్ సత్తా, అక్టోబర్ 05:** మండలంలో అమలాపురం గ్రామానికి చెందిన 44 కుటుంబాల పేద రైతులు తమ భూములను కాపాడాలని కూటమి నాయకులకు సోమవారం వినతి పత్రం అందజేశారు. సర్వే నెంబర్లు 404, 406, 410, 412, 413, 429, 445 లలో ఉన్న భూములను ప్రభుత్వం భూసేకరణ జాబితాలో చేర్చినట్లు చూపుతోంది. కానీ మేము మా భూములను ప్రభుత్వానికి ఇవ్వలేదని నిరుపేద రైతులము అయిన మా భూముల మీదుగా మా భూములకు దారి లేకుండా స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఫెన్సింగ్ వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 44 కుటుంబాల రైతులు మా భూములు ప్రభుత్వానికి ఇవ్వలేదని మా భూములను తీసుకోలేదని తెలిపారు. కానీ మా భూముల చుట్టూ స్టీల్ ప్లాంటు వారు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం వలన చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.మా భూములు ప్రభుత్వం తీసుకోలేదని ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా తమ భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ భూములపై హైకోర్టులో పిటిషన్ వేయడం కూడా జరిగిందని దాని నెం. డబ్ల్యు పి 35541/2018 కేసు



పెండింగ్‌లో ఉన్నదనితెలిపారు.మా పేద రైతుల భూముల చుట్టూ స్టీలు ప్లాంటు యాజమాన్యం ఫెన్సింగ్ వేయకుండా చూడగలరని కోరుతున్నామని తెలిపారు.

# విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం

విద్యా వికాసం--విద్యా వాహిని కార్యక్రమాలతో సృజనాత్మకతకు ప్రోత్సాహం.

మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు

**ధర్మవరం,అక్టోబర్ 05 (పెన్ సత్తా)** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సరైన మార్గదర్శకత్వం అందిస్తూ,వారిలో ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించడమే విద్యా వికాసం--విద్యా వాహిని కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్య,ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి,ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో భాగంగా ధర్మవరం పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ హైస్కూల్, పోతుకుంట జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో ఇటీవల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత,ప్రకృతి పరిరక్షణ ప్రాధాన్యత, పరిశుభ్రమైన పరిసరాలు,చెట్ల ఆవశ్యకత తదితర అంశాలను విద్యార్థులు తమ సృజనాత్మకతతో చిత్రాల రూపంలో చాటిచెప్పారని పేర్కొన్నారు.

డ్రాయింగ్ వంటి సృజనాత్మక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు,సమాజం పట్ల వారికి ఉన్న బాధ్యతను తెలియజేసే అవకాశం కలుగుతుందని హరీష్‌బాబు తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు సృజనాత్మకత, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.పర్యావరణ పరిరక్షణ అంశంపై నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హరీష్‌బాబు,ఏకలవ్య ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రశాంత్, పాఠశాలల ప్రిన్సిపాళ్లు పద్మావతి, గోపాలకృష్ణ తదితరులు విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.



ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రశాంత్,పాఠశాలల ప్రిన్సిపాళ్లు పద్మావతి, గోపాలకృష్ణ,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు,బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్ గౌడ్,బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింక చంద్ర,అంబటి సతీష్,బిల్లే శీన, కుంచపు నారప్ప, రవి,పాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాగిత లో దేవీ నవరాత్రి ఉత్సవాలకు రాటోత్సవం





**నక్కపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 05:** శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలకు పల్లెల్లో దుర్గాదేవి అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. కాగిత దుర్గాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సోమవారం రాటోత్సవం నిర్వహించారు. ఆలయ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు సంబంధించిన ముహూర్తపు పందిరి రాటను స్థానిక మహిళలు, భవాని భక్తులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో నక్కపల్లి, ఉపమాక, చినదొడ్డిగల్లు, వేంపాడు, ఉద్దండ పురం, రేబాక, ఎన్ నరసాపురం,గొడిచర్ల తదితర గ్రామాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈనెల 11వ తేదీ నుండి ప్రారంభం కానున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాన్ని సిద్ధం చేస్తున్నారు. ఆలయాల వద్ద భారీ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేస్తున్నారు. ప్రారంభం రోజున పెద్ద ఎత్తున అమ్మవారి బోనాల పండుగ నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారి భక్తులు, దీక్షాపరులతో పల్లెల్లో పండగ వాతావరణం నెలకొంది.

## మత్స్యకార సొసైటీ ఎన్నికలు సజావుగా జరిపించండి

- నక్కపల్లి పోలీస్ స్టేషన్లో వైసీపీ నాయకుల వినతి




**నక్కపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 05:**పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం మత్స్యకార గ్రామాల్లో నేడు నిర్వహించబోయే మత్స్యకార సొసైటీ ఎన్నికలు సజావుగా సాగేందుకు పోలీసులు సహకరించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ కోరారు. సోమవారం స్థానిక మత్స్యకార నాయకులతో కలిసి నక్కపల్లి పోలీస్ స్టేషన్లో ఎస్ ఐ సన్నిబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీసం రామకృష్ణ మాట్లాడుతూ మత్స్యకార గ్రామాలైన పెద్దతీనార్ల, దొండవాక, రాజయ్యపేట, బోయిపాడు, బంగారమ్మపేట లలో మంగళవారం మత్స్యకార సొసైటీ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. మత్స్యకారులు సొసైటీ ఎన్నికల్లో తనకు నచ్చిన అభ్యర్థికి ప్రశాంతంగా ఓటు వేసే విధంగా పోలీసులు సహకరించాలని కోరారు. ఈ ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించి ఎన్నికలు సజావు గా ఎటువంటి తగాదాలు లేకుండా జరిపించాలని కోరుకుంటూ నక్కపల్లి పోలీస్ వార్కి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. మత్స్యకారులకు నిరంతరం అండగా ఉండి మత్స్యకార సొసైటీల అభివృద్ధికి కృషి చేసే నాయకుడికి నిర్భయంగా ఓటు వేసి గెలిపించుకోవాలని ఆయన సూచించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు గొర్ల గోవిందరావు పలు గ్రామాల మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

## షుగర్ ఫ్యాక్టరీ ల భూముల అమ్మకాల జీవో రద్దు చేయాలి - సిపిఎం వినతి



**నక్కపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 05:** అనకాపల్లి జిల్లా లో గల కో ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీల భూములను, ఆస్తులను ఏపిఐఐసి కి అమ్ముతూ తీసుకువచ్చిన జీవో ఎంఎస్ నెంబర్ 250 ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది.దీనిలో భాగంగా సోమవారం విజయవాడ లో మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, రాష్ట్ర రైతు సంఘాలు సమన్వయ కర్త వడ్డే శోబనాదేశ్వరరావు ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు కలిసి చర్చించడం జరిగింది.ఈ సందర్భంగా వడ్డే శోబనాదేశ్వరరావు మాట్లాడుతూ రైతుల షేర్ ధనం, కష్టార్జితం తో ఏర్పాటు చేసిన షుగర్ ఫ్యాక్టరీలను, రైతులతో మహాజన సభ జరపకుండా, రైతులు అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోకుండా అమ్మడానికి కో ఆపరేటివ్ చట్టాలు అంగీకరించవని తెలిపారు, రైతులు తమ ఆస్తులు అయిన షుగర్ ఫ్యాక్టరీలను కాపాడుకోవడానికి ముందు కు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# జల్‌జీవన్ మిషన్‌పై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెప్పినవన్నీ అబద్ధాలు

**ప్రొద్దుటూరు (పెన్ సత్తా)ప్రతినిధి :** ప్రొద్దుటూరుకు వచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు ప్రజలకు అబద్ధాలు, మాయమాటలు చెప్పి వెళ్లారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ధ్వజమెత్తారు. ప్రొద్దుటూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ల ప్రొద్దుటూరు పర్యటన పూర్తిగా పైన పటారం లోన లొటారం అని తేల్చిచెప్పారు. జల్‌జీవన్ మిషన్ పేరుతో ప్రొద్దుటూరులో కార్యక్రమం నిర్వహించినా, ఆ పథకానికి ప్రొద్దుటూరు పట్టణానికి అసలు సంబంధమే లేదన్నారు. 2019–24 మధ్య జల్‌జీవన్ మిషన్ రద్దయిందని చెప్పడం పచ్చి అబద్ధమని, చంద్రబాబు ప్రత్యేకంగా నరేంద్ర మోడీతో మాట్లాడి ఆ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తీసుకొచ్చినట్టు పవన్ కళ్యాణ్ చెప్పడం కూడా వాస్తవాలకు విరుద్ధమని మండిపడ్డారు. 2028 డిసెంబర్ వరకు జలజీవన్ మిషన్‌ను కేంద్ర ప్రభుత్వమే దేశవ్యాప్తంగా పొడిగించిందని, చంద్రబాబు ప్రత్యేకంగా సాధించిన ఘనత ఏమీ లేదని స్పష్టం చేశారు. వైఎస్ జగన్ గారి ప్రభుత్వ హయాంలోనే జల్‌జీవన్ మిషన్, అమృత్ పథకాల కింద భారీగా పనులు చేపట్టి, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చామని తెలిపారు. ప్రొద్దుటూరు లోనే 40 వేల ఇళ్లకు శుద్ధి చేసిన తాగునీటిని అందించామని తెలిపారు.

జగన్ హయాంలోనే వేల కోట్ల రూపాయలతో జల్‌జీవన్ పనుల్లో 87 శాతం వరకు పూర్తి చేశామని, ఇప్పుడు మిగిలిన పనులకు చంద్రబాబు ప్రభుత్వం కొత్త ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. ప్రొద్దుటూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులపై కూటమి ప్రభుత్వం క్రెడిట్ తీసుకోవడం ఆపి, తాము చేసిన పనుల లెక్కను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరుకు ఇచ్చిన హామీల్లో రెండేళ్లలో ఏవి నెరవేర్చారో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రజలకు సమాధానం చెప్పాలని సవాల్ చేశారు. రాష్ట్రంలో రెండేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, కేవలం అబద్ధాలు, మోసాలతో కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఒక్క మంచిపనీ చేయని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, రాయలసీమకు చేసిన ద్రోహాన్ని ఆయన ప్రజల ముందు ఉంచారు. వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని, నేడు రాయలసీమకు జరుగుతున్న దోపిడీని ఎండగడుతూ రాబోయే రోజుల్లో జగన్ గారి నాయకత్వంలోనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని స్పష్టం చేశారు.

ఆయన ఇంకా ఏమన్నారంటే...

జల్‌జీవన్ మిషన్‌తో ప్రొద్దుటూరుకి సంబంధమే లేదు:

చంద్రబాబు ప్రొద్దుటూరుకు వచ్చి జల్‌జీవన్ మిషన్ పేరుతో ఇక్కడ కార్యక్రమం చేశారు. కానీ ప్రొద్దుటూరు పట్టణానికి జల్‌జీవన్ మిషన్‌తో అసలు సంబంధమే లేదు. ఏ పనులు ఎక్కడ చేస్తున్నారు? వాటి వల్ల ప్రొద్దుటూరు ప్రజలకు వచ్చే ప్రయోజనం ఏమిటో చంద్రబాబు సమాధానం చెప్పాలి. 2019–24 మధ్య జల్‌జీవన్ మిషన్ రద్దయిందని చెప్పడం పచ్చి అబద్ధం. చంద్రబాబు ప్రత్యేకంగా నరేంద్ర మోడీతో మాట్లాడి జల్‌జీవన్ మిషన్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకొచ్చినట్టు పవన్ కళ్యాణ్ చెప్పడం కూడా వాస్తవాలకు విరుద్ధం. కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న పథకాన్ని చంద్రబాబు తన ఘనతగా చెప్పుకోవడం ఏమిటి? జలజీవన్ మిషన్ అనేది వైఎస్ జగన్ గారి ప్రభుత్వంలో, కేంద్ర ప్రభుత్వం ద్వారా 26 వేల కోట్ల రూపాయలతో శాంక్షన్ అయిన పనులు. పులివెందుల తాలూకాలో 480 కోట్లతో చేపట్టిన పనులను మా ప్రభుత్వంలోనే 86 నుండి 87 శాతం పూర్తి చేశాం. కేంద్ర ప్రభుత్వమే దేశమంతా జలజీవన్ మిషన్ గడువును 2028 డిసెంబర్ వరకు పొడిగిస్తే, ఇది ఏదో చంద్రబాబు తెచ్చినట్లు పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. పవన్ కళ్యాణ్ కూడా అవే అబద్ధాలు వల్లించారు. 2019 ఫిబ్రవరి నాటికి గ్రామీణ ప్రాంతాల్లో 30,72,000 కొళాయి కనెక్షన్లు ఉంటే, జగన్ హయాంలో మరో 38,74,000 ఇళ్లకు నీళ్లు ఇచ్చాం. ఇప్పుడు మిగిలిపోయిన పనులకు కొత్త రంగులు వేసుకుని, కొత్త ప్రచారం చేసుకుంటూ తామే చేశామని చెప్పుకుంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు.

వైఎస్సార్సీపీ హయాంలో ప్రొద్దుటూరులోనే 40 వేల ఇళ్లకు తాగునీరు:

ఇంటింటికీ కుళాయి కనెక్షన్లపై అసలు వాస్తవాలు ప్రజలకు తెలియాలి. ప్రొద్దుటూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 40 వేల ఇళ్లకు శుద్ధి చేసిన తాగునీటిని అందించింది. శ్రీశైలం నుంచి గండికోటకు, గండికోట నుంచి మైలవరానికి, అక్కడి నుంచి ప్రొద్దుటూరుకు నీటిని తీసుకొచ్చాం. 2023 ఆగస్టులోనే ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశాం. శ్రీశైలం నీటి మట్టం పడిపోయినా రాయలసీమకు కృష్ణా జలాలు అందించాలనే లక్ష్యంతో జగన్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం తెచ్చింది. మేము చేసిన పనులకు ఇప్పుడు కొత్త రంగులు వేసుకుని చంద్రబాబు ప్రచారం చేసుకుంటూ క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నాడు. ప్రొద్దుటూరుకు కూటమి ఇచ్చిన హామీలు రెండేళ్లలో ఏమయ్యాయి? ఎస్వీఎన్ఆర్ గవర్నమెంట్ కాలేజీ అభివృద్ధి పనులు ఏమయ్యాయి? కొత్త బస్‌స్టాండ్ పరిస్థితి ఏమిటి? మీరు పూర్తి చేసిన పనులు ఏవి? ప్రజలకు లెక్క చెప్పండి. రాష్ట్ర ప్రజలకు రూ.30 వేల కోట్లతో నీళ్లు తెస్తామని చెబుతున్నారు. ఆ లెక్క ఏమిటో చెప్పండి. మేము చేసిన పనులను మాత్రం చూపించకుండా మీ ప్రచారం మాత్రమే చూపించుకుంటే ప్రజలు నమ్మరు. తాలమాపురం గ్రామానికి మా ఐదు సంవత్సరాల కాలంలో 33 కోట్ల రూపాయల సంక్షేమ పథకాలు ఇచ్చి, కోటి 20 లక్షలతో స్కూల్ డెవలప్మెంట్ చేశాం. కానీ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో ఇసుక దొంగలు రాజ్యమేలుతున్నారు. ఒక్క చౌడూరు గ్రామంలోనే రోజూ 30 లక్షల రూపాయల ఇసుక అమ్ముకుంటున్నారు.

రాయలసీమకు మాటలు.. అమరావతికి డబ్బుల మూటలు:

రాయలసీమ పేరుతో మరోసారి ప్రజలను మోసం చేయాలని చంద్రబాబు చూస్తున్నారు. అమరావతికి డబ్బుల మూటలు.. రాయలసీమకు మాటలు అన్నట్టుగా మీ ప్రభుత్వ విధానం ఉంది. రాయలసీమకు వైఎస్ రాజశేఖరరెడ్డి గారు, వైఎస్ జగన్ గారు చేసిన మేలును రాయలసీమ ప్రజలు మర్చిపోలేరు. చంద్రబాబు రాయలసీమకు చేసింది ఏంటి? ఈ రెండు అంశాలపై బహిరంగంగా చర్చకు రావడానికి మీరు సిద్ధమా? రాయలసీమ నుంచి అమరావతికి సంస్థలను తరలించే ప్రయత్నాలపై కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలి. వర్కుల పంపకంలో రాయలసీమకు జరిగిన అన్యాయంపై కూడా ప్రజలకు సమాధానం చెప్పాలి. తిరుపతిలో మేము తెచ్చిన స్కిల్ యూనివర్సిటీని, నేషనల్ ఫోరెన్సిక్ యూనివర్సిటీని అమరావతికి తరలించి సీమకు తీవ్ర ద్రోహం చేశారు. రాయలసీమకు నిజమైన బిడ్డలు వైయస్సార్, జగన్మోహన్ రెడ్డి మాత్రమే. రాయలసీమకు ద్రోహం చేసింది మాత్రం చంద్రబాబే. జగన్ గారు రాయలసీమకు చేయనిది ఏంటి? చంద్రబాబు గారు, మీరు చేసినది ఏంటి? బహిరంగ చర్చకు రండి. ప్రజల ముందే లెక్కలు తేల్చుకుందాం.

## స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి

**(పెన్ సత్తా) ప్రతినిధి :**రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు.వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు (కోఆర్డినేషన్), రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు (కోఆర్డినేషన్)తోనిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల అంశం, ఎస్ఐఆర్ అంశాలపై న్యాయపరమైన పరిణామాలు కొనసాగుతున్నప్పటికీ, ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడైనా రావచ్చన్న అంచనాతో పార్టీ ముందస్తు సిద్ధత కొనసాగించాలని పార్టీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ సూచించారని సజ్జల తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలు, ఎన్‌ఓసీలు, పన్నులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ముందుగానే సిద్ధం

చేసుకోవాలని చెప్పారు. గత కొద్ది రోజులుగా సర్వర్ సమస్యల కారణంగా ఈ సర్టిఫికెట్లు అందడంలో ఇబ్బందులు ఉన్నట్టు సమాచారం వస్తోందని పేర్కొన్నారు.

అభ్యర్థులు గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయాలని, దరఖాస్తులు స్వీకరించకపోతే లేదా సర్వర్ పనిచేయకపోతే ఆ పరిస్థితిని వీడియో రూపంలో నమోదు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్లను కలిసి సమస్యపై వినతిపత్రాలు అందించి, తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలని చెప్పారు.సర్టిఫికెట్ల జారీ ఆలస్యమైతే లేదా దరఖాస్తులను స్వీకరించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఆధారాలను సేకరించి స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు మరోసారి ప్రాతినిధ్యం ఇవ్వడంతో పాటు అవసరమైతే కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధం కావాలని తెలిపారు.

# వరుస మొబైల్ చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్





- 19 మొబైల్ ఫోన్లు, ఎర్టిగా కారు స్వాధీనం
- వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప

**ధర్మవరం,అక్టోబర్ 05 (పెన్ సత్తా)**ధర్మవరం పట్టణంలో వరుసగా మొబైల్ ఫోన్ చోరీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ.4 లక్షల విలువైన 19 మొబైల్ ఫోన్లు,చోరీలకు ఉపయోగించిన మారుతి సుజుకి ఎర్టిగా కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు, సంబంధిత డీఎస్పీ పర్యవేక్షణలో ధర్మవరం వన్‌టౌన్ పోలీసులు మొబైల్ ఫోన్ చోరీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కేసును ఛేదించినట్లు సీఐ తెలిపారు. పట్టణంలోని బస్టాండ్లు,రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికుల దృష్టిని మరల్చి మొబైల్ ఫోన్లను చోరీ చేస్తున్న ముఠాను సాంకేతిక ఆధారాలు,నిఘా సమాచారంతో గుర్తించినట్లు పేర్కొన్నారు.

అక్టోబర్ 3న ధర్మవరం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్,జోగొనికుంట ప్రాంతంలో బస్సు ఎక్కుతున్న సమయంలో సత్యసాయినగర్‌కు చెందిన ఎస్.బాబ్జాన్ (26) జేబులోని మొబైల్ ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీనిపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా అక్టోబర్ 5న ధర్మవరం--పుట్టపర్తి రోడ్డులోని యశోద స్కూల్ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు.ఈ సమయంలో అనుమానాస్పదంగా వచ్చిన ఎర్టిగా కారులోని వ్యక్తులు పోలీసులను గమనించి వాహనాన్ని వెనక్కి తిప్పుకుని తప్పించుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు కారును వెంబడించి అడ్డుకుని అందులో ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

విచారణలో నిందితులు ధర్మవరం బస్టాండ్‌లో మొబైల్ ఫోన్ చోరీకి పాల్పడినట్లు అంగీకరించడంతో పాటు,గతంలోనూ వివిధ ప్రాంతాల్లోని బస్టాండ్లు,రద్దీ ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లను చోరీ చేసినట్లు వెల్లడించారు. నిందితులు బస్సులు ఎక్కే సమయంలో రద్దీని ఆసరాగా చేసుకుని ప్రయాణికుల జేబుల్లోని మొబైల్ ఫోన్లను చాకచక్యంగా చోరీ చేసి,వెంటనే కారులో అక్కడి నుంచి వెళ్లిపోయేవారని దర్యాప్తులో తేలినట్లు సీఐ తెలిపారు.

అరెస్టయిన నిందితులను నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన ఎరుకల చరణ్,ఎరుకల రామాంజనేయులు, ఎరుకల గారడి విజయ్‌కుమార్,షేక్ రఫీగా పోలీసులు గుర్తించారు.వీరి నుంచి సుమారు రూ.4 లక్షల విలువైన 19 మొబైల్ ఫోన్లు, మారుతి సుజుకి ఎర్టిగా కారును స్వాధీనం చేసుకున్నారు.కొన్ని మొబైల్ ఫోన్లను నిందితులు వ్యక్తిగతంగా ఉపయోగిస్తుండగా, మరికొన్నింటిని కారులోని డ్యాష్‌బోర్డులో దాచినట్లు విచారణలో వెల్లడైంది.స్వాధీనం చేసుకున్న మిగిలిన మొబైల్ ఫోన్ల అసలు యజమానులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.చోరీ చేసిన మొబైల్ ఫోన్లను స్వీకరించి విక్రయిస్తున్నట్లు అనుమానిస్తున్న చిన్న లాలయ్య పాత్రపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.అతని ఆచూకీ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. నిందితుల గత నేర చరిత్రపైనా విచారణ కొనసాగుతోందన్నారు.

అరెస్టయిన నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

పోలీసు సిబ్బందికి అభినందనలు

కేసును ఛేదించడంలో చురుకైన పాత్ర పోషించి నిందితులను గుర్తించి అరెస్టు చేయడంతో పాటు చోరీకి గురైన మొబైల్ ఫోన్‌తో సహా మొత్తం 19 మొబైల్ ఫోన్లు, చోరీలకు ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకోవడంలో కృషి చేసిన హెడ్ కానిస్టేబుళ్లు జాకీర్ హుస్సేన్, వెంకటరాముడు, శ్రీధర్ ఫణి, కానిస్టేబుళ్లు ఉపేంద్ర, శివశంకర్,గంగాధర్, సబ్ డివిజనల్ క్రైమ్ సిబ్బందిని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ ఇషాక్ పాల్గొన్నారు.

# చట్టం చేయకుండా రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారు చంద్రబాబూ?

**రాజమహేంద్రవరం:(పెన్ సత్తా)** చట్టం చేయకుండా రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారు చంద్రబాబూ? కోర్టులో నిలబడని జీవో ఇచ్చి.. సుప్రీంకోర్టుకు వెళ్తామంటూ బీసీలను మభ్యపెట్టే నాటకం ఎందుకు? అని వైయస్ఆర్‌సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ నిలదీశారు. రాజమహేంద్రవరంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 34 శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తప్పుబట్టారు. బీసీలకు నిజంగా న్యాయం చేయాలంటే కోర్టులో నిలిచేలా చట్టబద్ధమైన ప్రక్రియను పూర్తి చేయాలని, బీసీ కమిషన్ నివేదికను బహిర్గతం చేసి, కులగణన లెక్కలను ఆధారంగా పెట్టుకుని రిజర్వేషన్లకు న్యాయపరమైన సమర్థన చూపించాలని స్పష్టం చేశారు. బీసీలను అమాయకులుగా భావించి జీవోలతో రాజకీయ నాటకాలు ఆడటం కాకుండా శాశ్వత చట్టబద్ధ పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

మీడియాతో మాజీ మంత్రి చెల్లుబోయిన ఏమన్నారంటే..

**కోర్టులో నిలబడని జీవోతో బీసీలను ఎలా నమ్మిస్తారు?**

"చట్టం చేయకుండా రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారు చంద్రబాబూ 34 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించాలంటే బీసీ కమిషన్ ఏర్పాటు చేసి, బీసీ జనాభాకు సంబంధించిన లెక్కలను ఆధారంగా తీసుకుని సమగ్ర నివేదిక ఇవ్వాలి. ఇంద్ర సహాని కేసులో 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించాలంటే కమిషన్ స్పష్టమైన నివేదిక, తగిన జస్టిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విషయం తెలిసి కూడా డెడికేటెడ్ కమిషన్ ఎందుకు వేశారు? ఆ కమిషన్ నివేదికను ఎందుకు బహిర్గతం చేయలేదు? కోర్టు కూడా ఇదే అంశాన్ని ప్రశ్నించింది. గత ప్రభుత్వం నిర్వహించిన కులగణనకు సంబంధించిన లెక్కలు ప్రభుత్వం వద్దే ఉన్నాయి. ఆ లెక్కలను కమిషన్‌కు అందించి, 34 శాతం రిజర్వేషన్ల అవసరాన్ని కోర్టు ముందు సమర్థించే అవకాశం ఉంది. అలాంటి చర్యలు తీసుకోకుండా కోర్టులో నిలబడని జీవో జారీ చేసి, ఇప్పుడు సుప్రీంకోర్టుకు వెళ్తామనడం బీసీలను మోసం చేయడం కాదా?"

**చట్టబద్ధత కల్పించే మార్గం తెలిసి కూడా ఎందుకు చేయరు?**

"బీసీలకు నిజంగా 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే చిత్తశుద్ధి ఉంటే చట్టం చేయాలి. ఆ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించేలా చేసి, నైన్త్ షెడ్యూల్‌లో చేర్చే ప్రయత్నం చేయాలి. నైన్త్ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా న్యాయ సమీక్ష పరిధికి రాకుండా రిజర్వేషన్లకు చట్టబద్ధమైన రక్షణ కల్పించే అవకాశం ఉంది. అమరావతి కోసం కేంద్రాన్ని ఒప్పించి చట్టం చేయించిన చంద్రబాబు.. బీసీల రిజర్వేషన్ల విషయంలో కేంద్రంపై ఎందుకు అదే స్థాయిలో ఒత్తిడి చేయడం లేదు బీసీల కోసం నిజంగా ఆరాటపడే వ్యక్తి అయితే కేంద్రానికి ఫైల్ పంపించి, పార్లమెంట్‌లో చట్టం చేయించి శాశ్వత పరిష్కారం చూపాలి. చట్టం చేయకుండా కేవలం జీవో ఇచ్చి, అది కోర్టు పరిధిలో నిలబడదని తెలిసి సుప్రీంకోర్టుకు వెళ్తామనడం వల్ల బీసీలకు ఏం ప్రయోజనం మాటలు, జీవోలు కాకుండా బీసీల రిజర్వేషన్లకు చట్టబద్ధమైన రక్షణ కల్పించాలి."

**సుప్రీంకోర్టుకు వెళ్తామన్నది రాజకీయ నాటకమే**

"హైకోర్టు తీర్పు తర్వాత సుప్రీంకోర్టుకు వెళ్తామన్నది స్థానిక సంస్థల ఎన్నికల కోసం చంద్రబాబు ఆడుతున్న రాజకీయ నాటకమే. చట్టం చేయకుండా రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారు? బీసీలను అమాయకులుగా భావించొద్దు. బీసీ సమాజంలోని యువత తమ అవకాశాల గురించి ఆలోచించాలి. 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెబుతూ



ఒకవైపు చట్టం చేయకుండా జీవో ఇవ్వడం, మరోవైపు సుప్రీంకోర్టుకు వెళ్తామని చెప్పడం వల్ల సమస్య పరిష్కారం కాదు. పవన్‌కల్యాణ్ మద్దతుతో బీసీలు అవసరం లేదన్న ధోరణిలో చంద్రబాబు వ్యవహరిస్తున్నారని మేము భావిస్తున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల కోసం 34 శాతం రిజర్వేషన్ల పేరుతో జరుగుతున్న పరిణామాలను బీసీ వర్గాలు గమనించాలి. కోర్టులో నిలబడని జీవోతో బీసీలను మభ్యపెట్టడం కాకుండా, చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారం చూపాలి."

# కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్.. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

**రాయచోటి:(పెన్ సత్తా)** కార్యకర్తల జోలికి వస్తే చూస్తూ ఊరుకునేది లేదని, ప్రతి కార్యకర్తకు ఎల్లవేళలా అండగా ఉంటానని, ప్రజల కోసం, పార్టీ కోసం చివరి శ్వాస వరకు పోరాడతానని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సంబేపల్లె మండలం గుట్టపల్లె కళ్యాణ మండపంలో సోమవారం వైయస్ఆర్‌సీపీ వివిధ హోదాల్లో బాధ్యతలు స్వీకరించిన నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్‌రెడ్డి కూటమి ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన శ్రీకాంత్‌రెడ్డి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 30 నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీల అమలు ఎక్కడని శ్రీకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500, 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్, నిరుద్యోగ యువతకు రూ.3 వేల భృతి ఏమైందని నిలదీశారు. కూటమి ప్రభుత్వం ఒక్క కొత్త పెన్షన్, ఒక్క కొత్త ఇల్లు అయినా మంజూరు చేసిందా అని ప్రశ్నించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల విషయంలో చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని, వైయస్ఆర్‌సీపీ మద్దతిస్తుందని స్పష్టం చేశారు.

రాయచోటి జిల్లా కేంద్రం తొలగింపుతో ప్రాంతానికి నష్టం

రాయచోటిని జిల్లా కేంద్రంగా తొలగించడం వల్ల ఈ ప్రాంత అభివృద్ధికి తీవ్ర నష్టం జరిగిందని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం కొనసాగి ఉంటే ప్రభుత్వ కార్యాలయాలు, ఉద్యోగులు, వ్యాపార కార్యకలాపాలతో ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించేదని పేర్కొన్నారు. జిల్లా కేంద్రం తొలగింపుతో వ్యాపారాలు దెబ్బతిన్నాయని, నిర్మాణ రంగం మందగించడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు తగ్గాయని తెలిపారు.

కార్యకర్తలే నా ప్రాణం

తన 18 ఏళ్ల రాజకీయ జీవితంలో వ్యక్తిగత దూషణలకు, అగౌరవ రాజకీయాలకు తావివ్వలేదని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తనకంటే చిన్నవారినైనా గౌరవంగా సంబోధించడం తమ పెద్దలు నేర్పిన సంస్కారమని చెప్పారు. అయితే వైయస్ఆర్‌సీపీ కార్యకర్తల జోలికి వస్తే మాత్రం సహించేది లేదని, ప్రతి కార్యకర్తకు ఎల్లవేళలా తోడుగా ఉంటానని స్పష్టం చేశారు.

స్థానిక ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ జెండా ఎగరాలి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొని నియోజకవర్గంలోని అన్ని స్థానాల్లో వైయస్ఆర్‌సీపీ జెండా ఎగరేలా ప్రతి కార్యకర్త కష్టపడాలని శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైయస్ఆర్‌సీపీ అధికారంలోకి వస్తే కార్యకర్తలు, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తామని అన్నారు. శ్రీనివాసపురం, జరికోన కాలువల అసంపూర్తి పనులను అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా పూర్తి చేసి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

కరువు పరిస్థితులపై ప్రభుత్వాన్ని నిలదీత

సంబేపల్లె మండలంతో పాటు నియోజకవర్గంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మామిడి, ఇతర పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం రైతులను ఆదుకునే చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు, పంటలు సాగు చేయలేని రైతులకు ఎకరాకు రూ.15 వేల చొప్పున తక్షణ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

కార్యకర్తల గుర్తింపు కార్డులు కేవలం పార్టీ పదవికి గుర్తింపు మాత్రమే కాకుండా పార్టీ తమపై ఉంచిన బాధ్యతకు ప్రతీక అని శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గుర్తింపు కార్డుదారులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్ అందిస్తారని తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

కార్యక్రమంలో ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, చిదంబర్‌రెడ్డి, గొర్ల ఉపేంద్రారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆనందరెడ్డి, సేర్ వెంకటరమణారెడ్డి, వడ్డీ వెంకటరమణారెడ్డి, గొర్ల రమేష్‌రెడ్డి, ఆవుల మల్లికార్జునరెడ్డి, గుండా సురేంద్ర, చుక్కా అంజనప్ప తదితర నాయకులు పాల్గొన్నారు. శ్రీకాంత్‌రెడ్డికి నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.

# పాకిస్తాన్ టీ20 జట్టుకు కొత్త కెప్టెన్

పాకిస్తాన్ క్రికెట్‌లో కీలక మార్పు చోటు చేసుకుంది. ఆ దేశ టీ20 జట్టుకు కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేశారు. ఏషియన్ గేమ్స్‌లో తాత్కాలిక సారథిగా వ్యవహరించిన సాహిబ్‌జాదా ఫర్హాన్‌కు పూర్తి స్థాయి టీ20 కెప్టెన్‌గా బాధ్యతలు అప్పజెప్పారు. త్వరలో స్వదేశంలో శ్రీలంకతో జరిగే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తో ఫర్హాన్ ఛార్జ్ తీసుకుంటాడు. ఇప్పటివరకు పాక్ టీ20 కెప్టెన్‌గా సల్మాన్ అఘా వ్యవహరించాడు. శ్రీలంకతో టీ20 సిరీస్ అక్టోబర్ 9, 11, 13 తేదీల్లో జరుగుతుంది. ఈ సిరీస్ కోసం పాక్ జట్టును కూడా ప్రకటించారు. ఈ జట్టులో స్టార్ ప్లేయర్లు బాబర్ ఆజమ్, షాహీన్ షా అఫ్రిదికి చోటు దక్కలేదు. అయితే ఈ ఇద్దరినీ ఆతర్వాత పాక్‌లోనే జరిగే వన్డే ట్రై సిరీస్‌కు ఎంపిక చేశారు.

ఈ ట్రై సిరీస్ అక్టోబర్ 18 నుంచి ప్రారంభమవుతుంది. ఈ టోర్నీలో పాక్, శ్రీలంకతో పాటు ఇంగ్లండ్ పాల్గొంటుంది. వన్డే టోర్నీలో పాక్ కెప్టెన్‌గా షాహీన్ అఫ్రిది వ్యవహరిస్తాడు.

**శ్రీలంకతో టీ20 సిరీస్‌కు పాక్ జట్టు**

సాహిబ్‌జాదా ఫర్హాన్ (కెప్టెన్), అబ్దుల్ సమద్, అబ్రార్ అహ్మద్, అరాఫత్ మిన్హాస్, ఫఖర్ జమాన్, హసన్ నవాజ్, మహ్మద్ ఇమ్రాన్, ఖ్వాజా నఫే (వికెట్‌కీపర్), మాజ్ సదాఖత్, నసీమ్ షా, రజావుల్లా, సైమ్ అయూబ్, సల్మాన్ మిర్జా, షాదాబ్ ఖాన్, సుఫియాన్ ముకీమ్.




**వన్డే ట్రై సిరీస్ కోసం పాక్ జట్టు**

షాహీన్ అఫ్రిది (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, అరాఫత్ మిన్హాస్, బాబర్ ఆజమ్, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, హారిస్ రౌఫ్, హసన్ నవాజ్, ఘాజీ ఘోరి (వికెట్‌కీపర్), నసీమ్ షా, రజావుల్లా, సాద్ బైగ్ (వికెట్‌కీపర్), సైమ్ అయూబ్, సల్మాన్ అలీ ఆఘా, షాదాబ్ ఖాన్, సుఫియాన్ ముకీమ్

# రేపటి నుంచి మాస్టర్స్ సూపర్ క్రికెట్ లీగ్

**హైదరాబాద్ :** క్రికెటర్‌గా రాణించాలన్న ఆకాంక్ష ఉన్నప్పటికీ వివిధ కారణాలతో ఆ కెరీర్‌ను కొనసాగించలేక ఇతర రంగాల్లో స్థిరపడిన వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు మాస్టర్స్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ (ఎంసీఏహెచ్)ను ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఎస్పీ రెడ్డి తెలిపారు. ఇందులో తొలి ప్రయత్నంగా ఈ నెల 7వ తేదీ నుంచి రెనోవా మాస్టర్స్ సూపర్ క్రికెట్ లీగ్ (ఎంఎస్ఎల్) నిర్వహిస్తున్నట్టు సోమవారం ప్రకటించారు. ఈ లీగ్ విన్నర్ ట్రోఫీని సినీ నటుడు అలీ ఆవిష్కరించారు. ఐదు రోజుల పాటు జరిగే టోర్నీలో కేఎల్ఆర్ ట్రాన్స్‌ఫార్మర్స్, మా స్పేసెస్, రేజింగ్ బుల్స్, జూపర్ ఎల్ఈడీ బుల్లెట్స్, సన్‌క్రెస్ట్ వారియర్స్, టెర్మినస్, రీట్ మేవరిక్స్ జట్లు బరిలోకి దిగనున్నాయి. 11న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.



## స్పోర్ట్స్

### వైభవ్ వెయిట్ చేయాల్సిందే!




**లక్నో:** టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ టీ20 జట్టులో సుస్థిర స్థానం సంపాదించాలంటే మరికొంతకాలం వేచి చూడక తప్పేట్టు లేదు. మంచి ఫామ్‌లో ఉన్న అతడిని వెస్టిండీస్‌తో సిరీస్‌లో ఆడిస్తారా? లేక ఓపెనర్లుగా అభిషేక్-సంజూనే కొనసాగిస్తారా? అని చర్చలు సాగుతున్న నేపథ్యంలో భారత ప్రధాన కోచ్ గౌతం గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గౌతీ స్పందిస్తూ.. 'ఇది నాక్కూడా కొత్త అనుభవమే. అతడు (వైభవ్) మంచి ఫామ్‌లో ఉన్నాడు. కానీ జట్టులో కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్న నైపుణ్యం కల్గిన ఆటగాళ్లను తీసేసి ఉన్నఫళంగా అతడిని తీసుకోవడం కరెక్ట్ కాదు. ఈ విషయాన్ని నేను వైభవ్‌కు అర్థమయ్యేలా చెప్పా. అతడు ఇంకొంత కాలం వేచి చూడాల్సిందే. ఒకవేళ వైభవ్‌ను ఆడించాల్సి వస్తే అభిషేక్, సంజూలలో ఎవరిని తప్పించాలన్నది చాలా కష్టమైన ప్రశ్న. గత రెండేండ్లుగా మెరుగ్గా ఆడుతున్న ఈ జోడీని మూడు, నాలుగు మ్యాచుల్లో సరిగ్గా ఆడలేదని, అదీగాక ఒక యువ ఆటగాడి కోసం తప్పించడం సరైన నిర్ణయం కాదు' అని చెప్పుకొచ్చాడు. జట్టు ఎంపిక విషయంలో మ్యాచ్‌కు తగ్గట్టు పరిస్థితులను బట్టి కెప్టెన్, కోచ్ నిర్ణయాలు తీసుకుంటారే తప్ప సోషల్ మీడియా ఒత్తిడితో టీమ్‌ను ఎంపిక చేయబోమని గౌతీ నొక్కిచెప్పాడు.

### తన్మయ్ సిక్సర్.. 174 రన్స్‌కే ఆస్ట్రేలియా ఆలౌట్

**అహ్మదాబాద్ :** సొంతగడ్డపై భారత అండర్-19 జట్టు ఆస్ట్రేలియాకు చుక్కలు చూపిస్తున్నది. ఇదివరకే వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి తొలి టెస్టులోనూ నెగ్గిన జోష్‌లో ఉన్న యువ భారత్.. సోమవారం నుంచి మొదలైన రెండో అనధికారిక టెస్టులోనూ సత్తాచాటింది. యువ స్పిన్నర్ తన్మయ్ బలోడా (6/32) ఆరు వికెట్లతో విజృంభించిన వేళ తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 174 రన్స్‌కే కుప్పకూలింది. అతడికి తోడు అయాన్ ఖాన్ (2/45) సైతం రాణించాడు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు 2 వికెట్లు కోల్పోయి 38 రన్స్ చేసింది.





సాంప్రదాయక అందంతో ఆకట్టుకుంటున్న సీరత్ కపూర్

# ఈ నలుగురు డైరెక్టర్ల స్ట్రాంగ్ జోన్ ఏంటో తెలుసా..? వీళ్ళ సక్సెస్ కి కారణం అదే...



ఈ నలుగురు డైరెక్టర్ల స్ట్రాంగ్ జోన్ ఏంటో తెలుసా..? వీళ్ళ సక్సెస్ కి కారణం అదే...

ప్రతి సన్నివేశంలో ఒక డీటెయిల్ ఉండాలని మొదటి సీన్ లోనే ప్రేక్షకుడికి సినిమా కథంతా చెప్పాలని క్లైమాక్స్ ఏం జరుగుతుందో మొదటి సన్నివేశంలోనే చెబితే ప్రేక్షకుడు పట్టుకుంటాడా?

ప్రేక్షకుడికి నచ్చేలా సినిమాని తెరకెక్కించడం అనేది అంత ఆషామాషీ వ్యవహారమైతే కాదు... ఇక అందులోనూ కమర్షియల్ సినిమాని తీయాలి అంటే కత్తి మీద సాములాంటిదనే చెప్పాలి. ఎందుకంటే సంవత్సరానికి 200 సినిమాలు రిలీజైతే అందులో దాదాపు 170 సినిమాలు కమర్షియల్ కథలతోనే తెరకెక్కుతుంటాయి. కాబట్టి వీటన్నింటికి చెక్ పెడుతూ డిఫరెంట్ తరహాలో సినిమాని తీసినప్పుడు మాత్రమే ఆ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తుంటారు. ఒకప్పుడు స్టార్ డైరెక్టర్లు గా వెలుగొందిన నలుగురు దర్శకులు కమర్షియాలిటీ ని పోగొట్టుకోకుండా వాళ్ల స్ట్రాంగ్ జోన్ లో సినిమాలను చేస్తూ సక్సెస్ లను సాధించారు... వాళ్ళలో కొందరు ఇప్పటికి రాణిస్తుండటం విశేషం...ప్రస్తుతం చాలామంది దర్శకులు ఒకటి రెండు సినిమాలతో సక్సెస్ లను సాధించి టాప్ డైరెక్టర్లుగా వెలుగొందుతున్నారు. కానీ 2000 నుంచి 2020 మధ్య వరకు కూడా ఒక నలుగురు సీనియర్ డైరెక్టర్లు వాళ్ళ స్ట్రాంగ్ జోన్ ను నమ్ముకొని ముందుకు సాగారు. ఇంతకీ ఆ దర్శకులు ఎవరు వాళ్ళ స్ట్రాంగ్ జోన్ ఏంటి అనేది ఒకసారి మనం తెలుసుకుందాం...

**రాజమౌళి**

'స్టూడెంట్ నెంబర్ వన్' సినిమాతో తన కెరీర్ ను మొదలుపెట్టిన రాజమౌళి మొదటి సినిమాతోనే తన మార్కును చూపించాడు. ఇక 'సింహాద్రి' సినిమాలో భారీ యాక్షన్ ఎపిసోడ్స్ ను రంగరించి మొత్తానికైతే ఆ సినిమాని బ్లాక్ బస్టర్ సక్సెస్ గా నిలపాడు... రాజమౌళి తన స్ట్రాంగ్ జోన్ అయిన ఎమోషన్ ఎలివేషన్ ను పట్టుకొని సినిమాను ముందుకు తీసుకెళ్తాడు. ఎక్కడా కూడా సినిమాని డల్ చేయకుండా సినిమా మొత్తానికి ఒక ఎమోషన్ ట్రాక్ రాసుకొని అందులోనే ఎలివేషన్స్ ను యాడ్ చేస్తూ ప్రేక్షకులందరికి ఒక హై మూమెంట్ ఇచ్చే విధంగా తన సినిమాల్లో కొన్ని సన్నివేశాలను చిత్రీకరిస్తూ ఉంటాడు. దానివల్ల సినిమాను చూసిన ప్రేక్షకుడికి ఒక హై ఫీల్ రావడమే కాకుండా ఆ సినిమాలను రిపీటెడ్ గా చూడడానికి అవకాశం ఉంటుంది...

**పూరి జగన్నాథ్**

ఇప్పుడంటే పూరి జగన్నాథ్ సక్సెస్ ని సాధించడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాడు. కానీ కెరియర్ స్టార్టింగ్ లో ఆయన చేసిన ప్రతి సినిమాలో ఏదొక వైవిధ్యమైన ఎలిమెంట్ ను పెట్టి సినిమాని సక్సెస్ తీరాలకు చేర్చేవాడు. ముఖ్యంగా ఆయన తన మేకింగ్ తో పాటు డైలాగ్స్ అలాగే హీరోల క్యారెక్టరైజేషన్ మీద ఎక్కువగా వర్క్ చేస్తుంటాడు అది అతని స్ట్రాంగ్ జోన్... అందుకే ఆయన పీక్ సక్సెస్ లో ఉన్నప్పుడు చేసిన సినిమాలు మంచి విజయాలను సాధించాయి. కొన్ని సినిమాలు కమర్షియల్ గా అంత ప్రాఫిట్ రాబట్టకపోయినా కూడా సగటు ప్రేక్షకులందరు అతని సినిమాని మినిమం గ్యారంటీ మూవీ గా భావించేవారు. అందుకే ఒక్కసారైనా ఆయన సినిమాలను చూసి ఎంజాయ్ చేసేవారు.

**త్రివిక్రమ్**

రైటర్ గా తన కెరియర్ ను మొదలు పెట్టిన త్రివిక్రమ్ కెరియర్ స్టార్టింగ్ లోనే టాప్ రైటర్ గా దిగాడు. ఇక తర్వాత దర్శకుడిగా మారిన ఆయన తన మార్కు ను చూపిస్తూ దర్శకత్వ విభాగంలో కూడా రాణిస్తున్నాడు. త్రివిక్రమ్ ముఖ్యంగా డైలాగుల మీద సినిమాను నడిపిస్తాడు. నిజానికి ఒక సినిమా మొత్తాన్ని డైలాగుల మీద నడిపించడం అనేది అనుకున్నంత ఈజీ కాదు. ఎందుకంటే సినిమాలో ఎమోషన్ బ్యాలెన్స్ చేస్తూనే పర్టిక్యూలర్ సిచువేషన్ లో ఎలాంటి డైలాగ్ పడితే ఆ సీన్ ఎలివేట్ అవుతుంది అనేది కూడా త్రివిక్రమ్ ముందుగానే ఊహించి అందులో డైలాగును పెట్టే ప్రయత్నం చేసుకుంటూ సినిమాని ముందుకు తీసుకెళ్తాడు. ఇక ప్రస్తుతం ఇప్పటికి ఆయన డైలాగుల మీదనే డిపెండ్ అయి ముందుకు సాగుతున్నాడు. మేకింగ్ పరంగా కూడా ఆయన కొంతవరకు అద్భుతాలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నప్పటికి అవి కొన్నిసార్లు వర్కౌట్ అయితే మరికొన్ని సార్లు నిరాశపరుస్తున్నాయి...

**సుకుమార్**

ప్రతి సన్నివేశంలో ఒక డీటెయిల్ ఉండాలని మొదటి సీన్ లోనే ప్రేక్షకుడికి సినిమా కథంతా చెప్పాలని క్లైమాక్స్ ఏం జరుగుతుందో మొదటి సన్నివేశంలోనే చెబితే ప్రేక్షకుడు పట్టుకుంటాడా? లేదా అనే ధోరణిలో వాళ్లకు ఒక పెను సవాల్ ను విసురుతూ ప్రేక్షకుల ఐక్యు కి టెస్టుపెట్టే దర్శకుడు సుకుమార్... కమర్షియల్ సినిమా టెంప్లేట్ లోనే అతను సినిమాలు చేస్తున్నప్పటికి ఇతర దర్శకుల సినిమాలు చూసినట్టుగా సుకుమార్ మూవీ చూస్తే వర్కౌట్ కాదు. ఆయన సినిమాలో డిటైలింగ్ అనేది చాలా అద్భుతంగా ఉంటుంది. ఒక సీన్ తో మరొక సీన్ ఇంటర్ లింక్ చేసి రాసుకుంటాడు. ఆ సీన్ లో ఏముంది? అది ఎందుకోసం జరుగుతుంది అనేది కూడా చాలా హై లెవెల్లో ఎలివేట్ చేస్తూ ఉంటాడు... తన ఇంటిలిజెంట్ రైటింగ్ తో సినిమాని ముందుకు తీసుకెళ్తూ ఉంటాడు. ముఖ్యంగా స్క్రీన్ ప్లే విషయంలో ఆయన ఎక్కడా తగ్గడు. డిఫరెంట్ స్క్రీన్ ప్లే ను ప్రేక్షకుడికి అందించినప్పుడే వాళ్లు ఒక థ్రిల్ ఫీల్ అవుతారని అనుకుంటున్నాడు. అందుకోసమే అతను సినిమాల్లో స్క్రీన్ ప్లే అనేది చాలా ఎఫెక్టివ్ గా ఉంటుంది... ఇలా పైన చెప్పిన నలుగురు దర్శకులు ఇప్పటికీ ఇండస్ట్రీ లో చాలా ఆక్టివ్ గా సినిమాలను చేస్తూ ముందుకు సాగుతున్నారు...



రాశి ఖన్నా అప్రయత్నమైన ఆకర్షణను నిర్వచించింది

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com